Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 87 మేడ్చల్ మల్కాజ్‌గిరి 19 ఏప్రిల్ 2023 బుధవారం పేజీలు : 4


### బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయంటే..

బులియన్ మార్కెట్‌లో బంగారం ధరలు ప్రతి రోజూ పెరుగుతూ తగ్గుతూ ఉన్నాయి. దేశీయంగా బంగారం, వెండి ధరలు ఇటీవలి కాలంలో వరుసగా పెరగడమో.. తగ్గడమో జరుగుతోంది. పెళ్లిళ్ల సీజన్ కాబట్టి బంగారం, వెండి కొనక తప్పడం లేదు. మహిళలతో బంగారం షాపులన్నీ కిటకిటలాడు తున్నాయి. మున్ముందు ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని నిపుణులు అంటున్నారు. ఇప్పటికే బంగారం ధర కొన్ని ప్రాంతాల్లో దాదాపు రూ.62 వేలకు చేరుకుని షాక్ ఇచ్చింది. నేడు మాత్రం బంగారం ధర కాస్త ఊరటనిచ్చింది. నేడు 22 క్యారెట్ల బంగారం ధర (10 గ్రాములు)పై రూ.10 తగ్గి రూ.55,9 30కి చేరుకోగా.. 24 క్యారెట్ల బంగారం ధర (10 గ్రాములు)పై రూ.61,020కి చేరుకుంది. ఇక కిలో వెండిపై మాత్రం రూ.1100 మేర తగ్గింది. నేడు కిలో వెండి ధర రూ.77,400కి చేరింది.

# దేశవ్యాప్తంగా...

# భానుడి భగభగలు




## పలు రాష్ట్రాలకు హీట్‌వేవ్ హెచ్చరికలు జారీ చేసిన ఐఎండీ

దేశవ్యాప్తంగా ఎండ తీవ్రత పెరిగింది. పలు రాష్ట్రాల్లో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. తెలుగు రాష్ట్రాల్లోనూ ఎండలు మండిపోతున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు 40 నుంచి 43 డిగ్రీలపైనే నమోదవుతున్నాయి. దీంతో మధ్యాహ్నం సమయంలో ఇంటి నుంచి బయటకి రావాలంటేనే ప్రజలు జంకుతున్నారు. ఉష్ణతాపానికి ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఈ నేపథ్యంలో మరో వారం రోజుల పాటు దేశంలోని పలు రాష్ట్రాల్లో ఇదే పరిస్థితి కొనసాగుతుందని భారత వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. ఎండ తీవ్రతతోపాటు వేడిగాలులు వీస్తాయని తెలిపింది. గరిష్ఠ ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల కంటే ఎక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది. పశ్చిమ బెంగాల్, బీహార్ రాష్ట్రాల్లో రానున్న నాలుగు రోజుల పాటు వేడిగాలులు వీస్తాయని ఐఎండీ తెలిపింది. ఏప్రిల్ 19, 20 తేదీల్లో ఉత్తరప్రదేశ్‌లో హీట్ వేవ్ పరిస్థితులు నెలకొంటాయని అంచనా వేసింది. ఇక సిక్కిం, ఒడిశా, జారండ్ రాష్ట్రాల్లో రానున్న రెండు మూడు రోజులు వేడిగాలుల తీవ్రత అధికంగా ఉంటుందని ఐఎండీ తెలిపింది. మరోవైపు ఆంధ్రప్రదేశ్‌తో పాటు దాని దక్షిణ కోస్తా ప్రాంతాల్లో బుధవారం వరకు వేడిగాలులు (Heat Wave) వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ముఖ్యంగా శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, కృష్ణా, ఎన్టీఆర్, బాపట్ల, గుంటూరు, పల్నాడు జిల్లాలకు హీట్ వేవ్ హెచ్చరికలను ఐఎండీ జారీ చేసింది. ఇదే సమయంలో రాష్ట్రంలోని మిగిలిన జిల్లాలు,రాయలసీమ ప్రాంతంలో 38 నుంచి 42 డిగ్రీల సెల్సియస్ వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది. మరోవైపు ఢిల్లీలోనూ హీట్ వేవ్ పరిస్థితులు వరుసగా రెండో రోజు కొనసాగాయి. కొన్ని వాతావరణ స్టేషన్లలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే కనీసం ఐదు డిగ్రీల సెల్సియస్ కంటే ఎక్కువగానే నమోదయ్యాయి. ఢిల్లీలోని సఫ్దర్‌జంగ్ అబ్జర్వేటరీలో గరిష్ట ఉష్ణోగ్రతలు 40.6 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. ఇది సాధారణం కంటే నాలుగు డిగ్రీలు ఎక్కువ. దేశ రాజధానిలో గరిష్ట ఉష్ణోగ్రత 40 డిగ్రీల సెల్సియస్ కంటే ఎక్కువగా నమోదవడం ఇది వరుసగా మూడో రోజు. పంజాబ్, హర్యానాలలో కూడా వేడి వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. హర్యానాలో 41.5 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతతో వేడిగాలులు వ్యాపించాయి. రెండు రాష్ట్రాల ఉమ్మడి రాజధాని ఛండీగఢ్‌లో వేడి తీవ్రత అత్యధికంగా 40 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. రాజస్థాన్‌లోని చురులో అత్యధికంగా 42.2 డిగ్రీల సెల్సియస్, బన్స్వారాలో 42.1 డిగ్రీలు, కరౌలీలో 41.4 డిగ్రీలు, అల్వార్‌లో 41.9 డిగ్రీలు, కోటాలో 41.2 డిగ్రీలు, పిలానీలో 41.5 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదైనట్లు ఐఎండీ వెల్లడించింది.



## హైదరాబాద్‌ను వరల్డ్ హెరిటేజ్ సిటీగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యం.. కేటీఆర్

వరల్డ్ హెరిటేజ్ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ ట్వీట్ చేశారు. హైదరాబాద్ నగరాన్ని వరల్డ్ హెరిటేజ్ సిటీగా మార్చడమే తమ ప్రభుత్వ లక్ష్యమని కేటీఆర్ స్పష్టం చేశారు. ప్రపంచ వారసత్వ దినోత్సవాన్ని పురస్కరించుకొని.. గత కొన్నేండ్ల నుంచి మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో అభివృద్ధి పరిచిన కొన్ని వారసత్వ కట్టడాలను మీ ముందు ఉంచుతున్నానని కేటీఆర్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు. బన్సీలాల్‌పేట మెట్ల బావి, కుతుబ్‌షాహీ టూంబ్స్, మొజాం జాహీ మార్కెట్, సికింద్రాబాద్ క్లాక్ టవర్ లాంటి వారసత్వ కట్టడాలను మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో అభివృద్ధి పరిచిన సంగతి తెలిసింది. చెత్తచెదారంతో నిండిపోయిన బన్సీలాల్‌పేట మెట్లబావిని పునరుద్ధరించి, సందర్శకులకు అందుబాటులోకి తీసుకొచ్చారు.

## పొంగులేటికి కాంగ్రెస్ భారీ ఆఫర్ - రంగంలోకి రాహుల్ టీం..!!




ఖమ్మం : పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఏ పార్టీలో ఎంట్రీ ఇవ్వనున్నారు. బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ అయిన పొంగులేటి మరో పార్టీలో చేరటం ఖాయమని చెబుతూ వచ్చారు. కానీ, పార్టీ పేరు మాత్రం స్పష్టం చేయలేదు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో తన మద్దతు దారులతో ఆత్మీయ సదస్సులు నిర్వహించారు. తాజాగా మాజీ మంత్రి జూపల్లిని ఆత్మీయ సమావేశానికి ఆహ్వానించారు. దీంతో, పొంగులేటి తో పాటుగా జూపల్లిని బీఆర్ఎస్ సస్పెండ్ చేసింది. ఇప్పుడు పొంగులేటికి కాంగ్రెస్ ను భారీ ఆఫర్ వచ్చింది. రాహుల్ టీం సభ్యులు పొంగులేటితో చర్చలు చేసారు.

**పొంగులేటికి కాంగ్రెస్ ఆఫర్ :** తెలంగాణలో రాజకీయ సమీకరణాలు వేగంగా మారిపోతున్నాయి. బీఆర్ఎస్ వర్సస్ బీజేపీగా ఇప్పటి వరకు సాగుతున్న ఫైట్ లో కాంగ్రెస్ క్రమేణా బలపడుతోంది. పార్టీకి రాష్ట్ర ఇంఛార్జ్ గా థాక్రే బాధ్యతలు స్వీకరించిన తరువాత మార్పు కనిపిస్తోంది. ఇప్పుడు బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ అయిన మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస రెడ్డిని కాంగ్రెస్ ముఖ్యులు తమ పార్టీలోకి ఆహ్వానిస్తున్నారు. బీఆర్ఎస్ వీడాలని నిర్ణయించిన పొంగులేటి వరుసగా పది నియోజకవర్గాల్లోనూ ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు. సస్పెన్షన్ తరువాత బీఆర్ఎస్ ముఖ్య నాయకత్వం పైన సీరియస్ కామెంట్స్ చేసారు. ఖమ్మం జిల్లాలోని పది నియోజవకర్గాల్లోనూ బీఆర్ఎస్ నుంచి ఎవరినీ అసెంబ్లీలోకి అడుగు పెట్టనీయనని చెప్పుకొచ్చారు. **ఖమ్మం జిల్లాలో కొత్త సమీకరణాలు :** ఖమ్మం జిల్లాలో బలమైన నేతగా ఉన్న పొంగులేటిని కాంగ్రెస్ పార్టీలోకి రావాలంటూ రాహుల్ టీం సభ్యులు ఆహ్వానించినట్లు సమాచారం. పొంగులేటి జిల్లాలో ఆర్దికంగా.. సామాజకంగానే కాకుండా ప్రతీ నియోజక వర్గంలో తనకంటూ మద్దతు ఉన్న నేత కావటంతో ఢిల్లీ ముఖ్య నేతలే రంగంలోకి దిగారు. జిల్లాలోని పది స్థానాలు తన వర్గానికి కేటాయిస్తే తాను పార్టీలోకి రావటానికి సిద్దమని ప్రతిపాదించినట్లు సమాచారం. అయితే, జిల్లాలో సీనియర్లు ఉండటంతో..పార్టీలో చేరితే సముచిత ప్రాధాన్యత ఇస్తామని హామీ ఇచ్చినట్లుగా చెబుతున్నారు. కాంగ్రెస్ ఖమ్మం జిల్లా సీనియర్లు మాత్రం పొంగులేటి చేస్తున్న డిమాండ్లు .. పార్టీ నాయకత్వం కొంత మేర సానుకూలంగా స్పందించటం పైన అసంతృప్తి తో ఉన్నట్లు తెలుస్తోంది.

**తెలంగాణకు ప్రియాంక :** పొంగులేటితో పాటుగా జూపల్లిని కూడా కాంగ్రెస్ లో చేర్చుకోవాలనే ప్రయత్నాలు సాగుతున్నాయి. జూపల్లి గతంలో కాంగ్రెస్ లో సుదీర్ఘ కాలం పని చేసారు. అటు కాంగ్రెస్..ఇటు బీజేపీ నుంచి ఇద్దరు నేతలకు ఆఫర్లు సిద్దంగా ఉన్నాయని తెలుస్తోంది.

జూపల్లి - పొంగులేటి ఈ నెల 23న తమ మద్దతు దారులతో సమావేశం కానున్నారు. తమకు పార్టీల్లో లభించే ప్రాధాన్యతకు అనుగుణంగా నిర్ణయం తీసుకొనే అవకాశం కనిపిస్తోంది. కాంగ్రెస్ లో చేరాలని ఈ ఇద్దరు నిర్ణయిస్తే...ప్రియాంక గాంధీ తెలంగాణలో పర్యటన సమయంలో ఈ ఇద్దరితో పాటుగా మరి కొందరు చేరికలకు టీపీసీసీ నాయకత్వం ప్రణాళికలు సిద్దం చేస్తున్నట్లు సమాచారం. దీంతో, పొంగులేటి- జూపల్లి కొత్త పార్టీ ఏంటనేది త్వరలో స్పష్టత రానుంది.

# బీఆర్ఎస్‌తో పొత్తుపై తేల్చేసిన రాహుల్




## రేవంత్ రెడ్డికి బిగ్ రిలీఫ్!!

హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలో వచ్చే ఎన్నికలలో బీఆర్ఎస్ పార్టీతో పొత్తుపై కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కర్ణాటక ఎన్నికల ప్రచారంలో పాల్గొని తిరిగి ఢిల్లీకి వెళుతున్న సమయంలో శంషాబాద్ ఎయిర్పోర్ట్ కు చేరుకున్న రాహుల్ గాంధీతో కాంగ్రెస్ పార్టీ నేతలు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్ర రాజకీయాలపై కాంగ్రెస్ నేతలతో అరగంట పాటు చర్చించారు. కర్ణాటక ఎన్నికలు ముగిసిన తర్వాత తెలంగాణ రాష్ట్రానికి ఎక్కువ సమయం కేటాయిస్తానని, తెలంగాణ పై ఫోకస్ చేస్తానని టీ కాంగ్రెస్ నేతలకు రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. బీఆర్ఎస్ తో పొత్తు పై స్పందించిన రాహుల్ గాంధీ నేడు తెలంగాణ ప్రాంత నేతలతో శంషాబాద్ ఎయిర్ పోర్ట్ లో రాష్ట్ర రాజకీయాలపై చర్చించారు. తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీతో పొత్తు ఉండబోదని రాహుల్ గాంధీ ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

ఐపీఎల్ లోనూ గంగూలీ వర్సెస్ కోహ్లీ వార్- ఎడమొహం, పెడమొహం-ఇన్ స్టాలో అన్ ఫాలోస్.. ఇక ఇదే విషయాన్ని ప్రజలకు వివరించాలని పేర్కొన్న ఆయన బిజెపి చేసే ప్రయత్నాలను తిప్పి కొట్టాలన్నారు. రాహుల్ గాంధీ వ్యాఖ్యలతో రేవంత్ రెడ్డికి బిగ్ రిలీఫ్ దొరికింది. బీఆర్ఎస్ పార్టీతో కాంగ్రెస్ పొత్తు ఉందనే అంశాన్ని బిజెపి ప్రజా క్షేత్రంలో ప్రచారం చేస్తూ లబ్ధి పొందాలని ప్రయత్నం చేస్తుందని రాహుల్ గాంధీ కాంగ్రెస్ నేతలకు తెలిపారు.

దీనికి చెక్ పెట్టడానికి తాము బిఆర్ఎస్ తో పొత్తు పెట్టుకోబోమని ప్రజలకు అర్థమయ్యేలా చెప్పాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఎంఐఎం ప్రభావం గురించి పార్టీ నేతలతో చర్చించిన రాహుల్ గాంధీ ఈ ఏడాది చివర్లో జరగనున్న తెలంగాణ రాష్ట్ర ఎన్నికలపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. అందుకే కర్ణాటక ఎన్నికలు ముగిసిన తర్వాత తెలంగాణ పై ఫోకస్ చేస్తానని వెల్లడించారు. ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలని, వచ్చే ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని పార్టీ శ్రేణులు ఒక్క తాటిపై పని చేయాలని ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు.

# సంపాదకీయం

## విడిపోయాక కూడా ఈ మాటల మంటలు అవసరమా?

విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ అంశం ఏపీ తెలంగాణ నేతల మధ్య చిచ్చు రాజేసిన సంగతి తెలిసిందే. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా తాము ఆసక్తి వ్యక్తీకరణ కోసం బిడ్డు దాఖలు చేస్తామని కొద్ది రోజుల క్రితం తెలంగాణ మంత్రులు ప్రకటించారు. కొద్ది రోజుల్లో సింగరేణి నుంచి నిపుణుల బృందం స్టీల్ ప్లాంట్ ను సందర్శిస్తుందని వెల్లడించారు. ఈ సందర్భంగా ఆంధ్రాలో ఆయా పార్టీల నేతలకు రాష్ట్ర ప్రయోజనాలు పట్టవని బీఆర్ఎస్ నేతలు తీవ్ర విమర్శలు చేశారు. బీఆర్ఎస్ మంత్రులు నేతల వ్యాఖ్యలపై వైసీపీ నేతలు కూడా ఘాటు విమర్శలు చేశారు. బొత్స సత్యనారాయణ కారుమూరి నాగేశ్వరరావు సీదిరి అప్పలరాజు పేర్ని నాని తదితరులు బీఆర్ఎస్ నేతలపై మండిపడ్డారు. ఈ క్రమంలో కేంద్ర సహాయ మంత్రి ఫగ్గన్ సింగ్ కులస్తే చేసిన వ్యాఖ్యలు ఈ చిచ్చును పెంచడానికి మరింత ఆజ్యం పోశాయి. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ చేయాలనుకోవడం లేదని ఆయన తాజాగా విశాఖ పర్యటనలో వ్యాఖ్యానించారు. దీంతో కేటీఆర్ హరీష్ రావు.. కేసీఆర్ దెబ్బకు కేంద్రం దిగివచ్చిందని.. ఏపీలో బీఆర్ఎస్ సాధించిన తొలి విజయం ఇదంటూ వ్యాఖ్యానించారు. కేటీఆర్ హరీష్ వ్యాఖ్యలపై వైసీపీ ఎమ్మెల్యే పేర్ని నాని ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఉట్టికెక్కలేనమ్మ స్వర్గానికి ఎక్కానన్నట్టు బీఆర్ఎస్ నేతల వ్యవహారం ఉందని మండిపడ్డారు. చంద్రబాబులాగా మామను వెన్నుపోటు పొడవటానికి హరీష్ రావు సిద్ధంగా ఉన్నాడని విమర్శించారు. ఇక పశుసంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు చేసిన వ్యాఖ్యలు కలకలం రేపాయి. బీఆర్ఎస్ నేతలు ప్రాంతీయ ఉన్మాదులని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్ లో మెజారిటీ పెట్టుబడులు ఏపీ వారివేనని తెలిపారు. ఇప్పటికీ నిధులు నీళ్ల విషయంలో ఏపీ ప్రజలను ఇబ్బందులు పెడుతున్నారని మండిపడ్డారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి మంత్రి సీదిరి అప్పలరాజుకు ఫోన్ వెళ్లినట్టు.. ఇలా తీవ్ర వ్యాఖ్యలు చేయడం ఏమిటని తలంటినట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి. అయినా రెండు రాష్ట్రాలు విడిపోయి ఎవరి పాలన వారు సాగించుకుంటున్నాయి. ప్రజలు కూడా విడిపోయినా అన్నదమ్ముల్లానే జీవిస్తున్నారు. అయితే రెండు రాష్ట్రాల్లో అధికార పార్టీలు.. బీఆర్ఎస్ వైసీపీ నేతలు మాత్రం మాటల తూటాలను వదులుతూ మరోమారు విద్వేషాలను పెంచుతున్నారనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఎన్నికలు దగ్గర పడుతున్న నేపథ్యంలో కేసీఆర్ కు జగన్ జగన్ కు కేసీఆర్ సహకరించుకోవడంలో భాగంగానే ఇదంతా జరుగుతుందనే వ్యాఖ్యానాలు కూడా వినవస్తున్నాయి. భావోద్వేగాలను రెచ్చగొట్టి లబ్ధి పొందడంలో కేసీఆర్ తర్వాత ఎవరైనా అని.. దానికి తగ్గట్టే వైసీపీ నేతల వ్యవహారం ఉందని అంటున్నారు. నేతల మధ్య మాటల తీవ్రత తగ్గాల్సిన అవసరం ఉందని.. ప్రజల మధ్య మరోమారు విభేదాలు సృష్టించే ప్రయత్నాలు వద్దని విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు.

# పునరావాసానికి మోక్షమెప్పుడో?

ఆదిలాబాద్ : కవ్వాల్ అభయారణ్యం పెద్ద పులుల ఆవాసానికి అనుకూలంగా ఉందని ప్రభుత్వం టైగర్‌జోన్‌గా ఎంపిక చేసింది. అప్పటి నుంచి ఇప్పటి పులి సం రక్షణ కోసం ఎన్నో రకాల పనులను అడవుల్లో చేపట్టింది. ఈ క్రమంలోనే పెద్దపులి స్వేచ్ఛగా సంచరించేందుకు ఇక్క డి ప్రాంతాన్ని అనువుగా మార్చాలని అధికారులు సర్వే ని ర్వహించారు. 2012 లో జరిగిన ఈ సర్వే ప్రకారం కవ్వాల్ అభయారణ్యంలో ఉన్న 18 చిన్నచిన్న గ్రామాలను ఇతర మైదాన ప్రాంతాలకు తరలించాలని నిర్ణయించారు. అయితే ఆదివాసీలకు ఇతర ప్రాంతాల్లో సరైన సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ ఊపందుకోవడంతో వారికి పునరావాసం క ల్పించాలని ప్రభుత్వం నిర్ణయానికి వచ్చింది. ఈ నేపథ్యం లో కడెం మండలం ఉడుంపూర్ రేంజ్ పరిధిలోని గిరి గ్రా మాలైన మైసంపేట్, రాంపూర్ గ్రామాలకు మొదటి విడత పునరావాసం కల్పించాలని నిర్ణయించారు. ఈ దిశగా అప్ప టి అటవీశాఖ మంత్రి జోగురామన్న, స్థానిక ఎమ్మెల్యే అజ్మీ రా రేఖానాయక్‌తో పాటు పలువురు జిల్లా, రాష్ట్రస్థాయి అ?దికారులు ఆ గ్రామాల్లో పర్యటించి పునరావసంపై అవగాహన కల్పించారు. మొదట అడవిని వీడేందుకు నిరాకరించి న గిరిబిడ్డలు ఎట్టకేలకు వారికి అన్నీ సౌకర్యాలు కల్పిస్తామనడంతో వెళ్లేందుకు సిద్ధపడ్డారు. ఇదంతా 2016లో జరిగిం ది. అటవీశాఖ ఉన్నతాధికారులు, మంత్రి, ఎమ్మెల్యే అంతా వచ్చి చెప్పడంతో పునరావాసంపై అడవిబిడ్డల్లో ఆశలు పెరిగాయి. కానీ తమకు పునరావాసం గానీ, మౌలికవసతులు గానీ కల్పించడం లేద ని, దీంతో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని అడవిబిడ్డలు ఆవే దన వ్యక్తం చేస్తున్నారు.

ఆరేళ్లుగా హామీలే తప్ప అమలు లేదు..

కవ్వాల్ అభయారణ్యాన్ని టైగర్‌జోన్‌గా ప్రకటించన తర్వాత 2012లో ఖానాపూర్ డివిజన్ పరిధిలోని మైసంపేట్, రాంపూర్, జన్నారం డివిజన్ పరిధిదిలోని దొంగపెల్లి, అలీనగర్, మల్యాల గ్రామాలను అడవిలోంచి మైదాన ప్రాంతాలకు తరలిస్తారనే ప్రచారం ప్రారంభమైంది. దీంతో అడవిబిడ్డలు టైగర్‌జోన్‌ను వ్యతిరేకిస్తూ ఎక్కడికక్కడ ఆందోళనలు నిర్వహించారు. విషయం తెలుసుకున్న అటవీశాఖ అధికారులు రంగంలోకి దిగి మహారాష్ట్రలోని తడోబా ప్రాంతంలో పునరావాసం కల్పించిన గ్రామాలకు ఇక్కడి ప్రజలను తీసుకెళ్లి అవగాహన కల్పించారు. దీంతో మైదాన ప్రాంతాలకు వెళ్లేందుకు సుముఖత వ్యక్తం చేశారు. కానీ అధికారులు సర్వేలు చేయడం మాత్రమే ఇప్పటి వరకు జరుగుతోంది. పునరావాసం మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది.

పులుల సంచారంతో ఆందోళన..

కవ్వాల్ అభయారణ్యంలో నానాటికి వన్యప్రాణుల సం చారం పెరుగుతోంది. అటవీశాఖ చేపడుతున్న చర్యలు సత్ఫలితాలనిచ్చి మహారాష్ట్రలోని తడోబా అడవుల్లోంచి ఇ క్కడి కవ్వాల్ అభయారణ్యానికి పెద్దపులులు వస్తున్నట్లు చెబుతున్నారు. ఇటీవల కాలంలో పలు చోట్ల పెద్దపులి పశువులపై దాడి చేసి చంపడం, పంట చేలకు వెళ్లిన వారికి క నిపించడంతో దట్టమైన అడవుల్లో ఉన్న ఈ మైసంపేట్, రాంపూర్ గ్రామాల ప్రజల్లో భయాందోళనలు కలిగిస్తున్నాయని చెబుతున్నారు. తమకు వెంటనే పునరావాసం కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు పెద్దపులి సంరక్షణ కోసం ఏర్పాటు చేసిన టైగర్‌జోన్‌లో మనుషుల అలజడి కూడా పులికి సైతం ఇబ్బంది కలిగిస్తుందని అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. సాధ్యమైనంత త్వరగా ఈ రెండు గ్రామాలకు పునరావాసం కల్పించి మిగతా గ్రామాల ప్రజలకు నమ్మకం కల్పించాలని దృఢనిశ్చయంతో ఉన్నారు.

పునరావాసం కోసం రెండు ఆప్షన్లు..

కవ్వాల్ టైగర్‌జోన్‌లోని అడవిప్రాంతంలోని మైసంపేట్, రాంపూర్ గ్రామాల ప్రజలు వారి గ్రామాలను వీడి మైదాన ప్రాంతాలకు వెళ్లేందుకు ప్రభుత్వం వారికి రెండు ఆప్షన్‌లను కల్పించింది. ఒకటో ఆప్షన్‌లో ఒక్కో ఫ్యామిలీకి యూనిట్‌కు రూ.10 లక్షల నగదును ఇస్తే వారు ఇష్టమున్న చోటుకు వెళ్లిపోవచ్చనేది. రెండో ఆప్షన్‌లో అటవీశాఖ ఆధ్వర్యంలోనే వారికి ఇళ్లు నిర్మించి ఇవ్వడం, వ్యవసాయ భూమిని కోల్పోయిన వారికి వ్యవసాయ భూమిని ఇవ్వడంతో పాటు అన్ని మౌలిక సదుపాయాలు కల్పించడం. ఈ రెండు ఆప్షన్‌లను మైసంపేట్, రాంపూర్ గ్రామాల్లోని 142 కుటుంబాల ముందుంచారు. దీంతో 48 కుటుంబాలు మొదటి ఆప్షన్‌ను ఎంచుకోగా 94 కుటుంబాలు రెండో ఆప్షన్ ద్వారా పునరావాసం పొందేందుకు ఒప్పుకున్నారు. ఇందులో భాగంగా కడెం మండలం పెద్దూర్, కొత్తమద్దిపడగ గ్రామాల సమీపంలో 112 హెక్టార్లలో స్థలాన్ని సైతం కేటాయించారు. 2016లోనే ఈ ప్రక్రియ పూర్తి చేసిన అధికారులు ఇప్పటి వరకు ఈ రెండు గ్రామాల ప్రజలకు పునరావాసం కల్పించకపోవడం పట్ల స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

వసతులు లేక ఇబ్బంది పడుతున్నాం..

– కోవ ప్రవీణ్, మైసంపేట్

మా గ్రామాలను అడవి నుంచి తరలించి పునరావాసం కల్పిస్తామని 2012 నుంచి అధికారులు, మంత్రులు, ఎమ్మెల్యేలు చెబుతున్నారు. ఇప్పటి వరకు అటు పునరావాసం కల్పించడం లేదు. ఇటు మా గ్రామంలో ఎటువంటి మౌలికవసతులు కల్పించడం లేదు. దీంతో తవ్ర ఇబ్బంది పడుతున్నాం.

మాగ్రామంలో కరెంటు కూడా లేదు..గాదె బుచ్చవ్వ, రాంపూర్

మా గ్రామంలో ఇప్పటి వరకు కరెంటు లేదు. పునరావాసం కల్పిస్తామని చెబుతున్నారు. ఎటు తీసుకపోతలేరు. దీంతో ఇబ్బందులు పడుతున్నాం. ఇక మాకు పునరావాసం అవసరం లేదు. ఇక్కన్నే సౌకర్యాలు కల్పిస్తే మా ఊళ్లో మేం ఉంటాం.

డబ్బులు పెంచాలని ప్రతిపాదనలు..– కోటేశ్వర్‌రావు, ఎఫ్‌డీవో

ఖానాపూర్‌పునరావాస గ్రామాలైన మైసంపేట్, రాంపూర్ గ్రామాలలో ఒక్కో కుటుంబానికి యూనిట్‌కు రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షలు పెంచాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. త్వరగా పునరావాస గ్రామాలను తరలిస్తేనే పెద్దపులుల సంతతి పెంపొందుతుంది.

# పైప్‌లైన్ లీకేజీతో దెబ్బతింటున్న రోడ్లు

ఆదిలాబాద్ : మండలంలోని ఇట్యాల గ్రామ పంచాయతీ పరిధిలో గొట్టెగుట్ట గ్రామంలో పైపులైన్లు లీకేజీ నీటితో బీటీ రహదారి గుంతలమయంగా మారింది. ఇదే రహదారి గుండా భీమిని మండలంలోని కేస్లాపూర్, వడాల, చిన్నగుడిపేట గ్రామాల ప్రజలతోపాటు దహెగాం, కాగ జ్‌నగర్ మండలాల ప్రజలు, ఉద్యోగులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ఎదురెదురుగా వాహనాలు వచ్చినప్పుడు తీవ్రఇబ్బందులు పడు తున్నామని వాహనదారులు వాపోతున్నారు. నీరు వృధాగాపోయి బీటీరహదారి చెడి పోయినా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని ఆయాగ్రామాల ప్రజలు ఆరోపి స్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.




ఆదిలాబాద్ : జిల్లాలో తెల్ల బగారం ధరలు అమాంతం పైపైకి వెళ్తున్నాయి. వ్యవసాయ మార్కెట్లలోనూ పత్తి రైతులకు మంచి ధరనే లభిస్తుంది. గతంలో ఎన్నడూ లేని విధంగా క్వింటాలుకు రూ.10 వేల ధర పలుకుతోంది. కాని ఆశించిన దిగుబడి రాక పత్తి రైతులు దిగాలుగా ఉన్నారు. పెట్టిన పెట్టుబడులు వస్తున్నాయన్న సంతృప్తితో సరిపెట్టుకుంటున్నారు. ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా వ్యవసాయ మార్కెట్‌లో క్వింటాలు పత్తి ధర రూ.10 వేలు ఉన్న రైతుల వద్ద మాత్రం పత్తి లేకపోవడంతో.. ఉన్న కొద్దిమంది రైతులకు మాత్రమే ఈ ధర వర్తిస్తుంది.

ఫ తగ్గిన పంట దిగుబడి

జిల్లాలో పత్తి దిగుబడి గతంతో పోలిస్తే తగ్గిపోయింది. ఎకరానికి 8 నుంచి 12 క్వింటాళ్ల వరకు దిగుబడి రావాల్సిన పత్తి.. కేవలం మూడు నుంచి ఐదు క్వింటాళ్లకు పరిమితమైంది. తొలుత అకాల వర్షాలు అన్నదాతను ఆగమాగం చేశాయి. పూత, కాత సమయం లోనూ వానలు ఇబ్బంది పెట్టాయి. దీంతో పత్తి కాయలు తక్కువగా రావడంతో పాటు.. చీడపీడలు కొంతమేర తోడవడంతో రైతులు నష్టాల బాట పట్టారు. జిల్లాలో 3లక్షల 93వేల ఎకరాల్లో పత్తి సాగవుతుందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేయగా సుమారు 3లక్షల75వేల ఎకరాల్లో పత్తిని సాగు చేశారు. ఎకరానికి 8 క్వింటాళ్ల చొప్పున 11లక్షల 53వేల 616 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అంచనా వేశారు. కాని ఎకరానికి మూడు క్వింటాళ్ల పత్తి దిగుబడి వచ్చినట్లు రైతులు చెబుతున్నారు. అంటే జిల్లాలో మూడు లక్షల పైచిలుకు క్వింటాళ్ల పత్తి పండినట్లు అంచనాలు ఉన్నాయి.

ఫ పెట్టుబడులకే పరిమితం

పత్తి ఎకరానికి పెట్టుబడి రూ.25 నుంచి 30వేల వరకు వచ్చినట్లు రైతులు చెబుతున్నారు. దున్నకాలు, విత్తనాలు, పిండిబస్తాలతో పాటు ఈ యేడాది కూలీల ఖర్చులు అధికం కాగా, మార్కెట్లకు ట్రాన్స్‌పోటేషన్‌కు భారీగా పెట్టుబడి పెట్టాల్సి వచ్చింది. కానీ దిగుబడి సరాసరి మూడుక్వింటాళ్లకు అటూ, ఇటుగా రావడంతో.. వచ్చిన డబ్బులు పెట్టుబడికి సరిపోయాయి. దిగుబడి ఎక్కువగా వచ్చి ఉంటే మంచి లాభాలు ఉండేవి. ఈసారి బీటీ–2 రకం విత్తనాలు అనుకూలించలేదు. గతంలో సింగిల్ బీటీ విత్తనాలు రెండు క్రాప్‌లు వచ్చేవని, నీటి తడులు అందిస్తే ఉగాది వరకు కూడా పంట ఉండేదని రైతులు చెబుతున్నారు. అయితే గత కొన్నేళ్లుగా డబుల్ బీటీ విత్తనాలే మార్కెట్‌లో ఉంటున్నాయి. వివిధ కంపెనీలకు చెందిన విత్తనాలు అందుబాటులో ఉండడంతో వాటినే రైతులు విత్తుకోవాల్సి ఉంటుంది. ఈ విత్తనాలు వేస్తే యేటేటా దిగుబడి తగ్గుముఖం పడుతూ వస్తున్నాయి. నీటితడులు తట్టినా ఒక క్రాప్ మాత్రమే వస్తోంది. రెండో క్రాప్ ఆశలు ఆడియాశలే అవుతున్నాయి. దీంతో మార్చి వరకు ఉండే పంట.. ఇప్పుడు జనవరి నెలలోనే లూటిపోతున్నాయి. దీంతో రైతులకు నష్టమే మిగులుతోంది. ఈ యేడాది పత్తి పంట చేతికొచ్చే సమయంలో కురిసిన అకాల వర్షాలు సైతం అన్నదాతను కోలుకోకుండా చేశాయి. అంతేకాకుండా రైతుల వద్ద పత్తి పంట ఉన్న సమయంలో ఆశించిన ధర లభించకపోవడంతో వర్షం కలిగించిన నష్టం నుంచి అన్నదాత ఇప్పటికీ కోలుకోవడం లేదు.

ఫ ధర పైపైకి...జిల్లాలో పత్తి ధరలు రోజురోజుకు పెరుగుతున్నాయి. క్వింటాలుకు రూ.8200 నుంచి మొదలుకాగ, ప్రస్తుతం రూ.10వేలు దాటింది. తెలంగాణలోని అన్ని జిల్లాల్లో దాదాపు మంచి ధరలే పలుకుతున్నాయి. అయితే జిల్లాలోని జైనథ్, బేల, ఇచ్చోడ వ్యవసాయ మార్కెట్లతో పాటు జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌లో గత మూడు రోజులుగా పత్తి క్వింటాలుకు రూ.10వేలు ధర పలుకుతోంది. అయితే ప్రస్తుతం ధర క్వింటాలు కు రూ.10వేలు పలుకుతున్నా.. దిగుబడి తక్కువ రావడం, ప్రస్తుతం రైతుల వద్ద ఆశించిన స్థాయిలో పత్తి పంట లేకపోవడంతో దిగాలు చెందుతున్నారు. ఇదిలా ఉంటే దిగుబడి తక్కువ రావడం, మార్కెట్‌లో డిమాండ్ ఉండడంతో వ్యాపారులు అధిక ధరకు కొంటున్నారు. సాగు విస్తీర్ణం కొంతమేరకు తగ్గడంతో పాటు దిగుబడి పడిపోవడంతో పత్తికి డిమాండ్ పెరిగింది. అంతేకాకుండా ధర బాగుండడంతో పలువురు రైతులు ఇప్పటికే తమ వద్ద నిలువ ఉంచుకున్న పత్తిని మార్కెట్‌కు తీసుకొచ్చి పెరిగిన ధరతో లబ్ధి పొందడం గమనార్హం.

# కొత్తరోడ్లకు మోక్షం

నిర్మల్ : జిల్లాలోని రెండు ప్రధానరోడ్ల నిర్మాణానికి ఎట్టకేలకు అవరోధాలు తొలగిపోయాయి. గత నాలుగేళ్ల కింద ఈ రోడ్డు పనులకు టెండర్‌లను సైతం నిర్వహించినప్పటికీ సకాలంలో నిధు లు విడుదల కాక ఆ పనులను దక్కించుకున్న గుత్తేదారులు చేతులెత్తేశారు. దాదాపు రూ.17 కోట్లతో ఈ రెండు ప్రధానరోడ్ల నిర్మాణాలకు అధి కారులు టెండర్‌లు నిర్వహించారు. జిల్లా కేంద్రమైన నిర్మల్ పట్టణంలోని ఈద్గాం నుంచి కౌట్ల(కె) వరకు 7 కిలోమీటర్ల పొడవుతో నిర్మించ తలపెట్టిన రోడ్డు కోసం రూ.8కోట్లతో ప్రతిపాది ంచారు. అలాగే సిర్గాపూర్ సారంగాపూర్ మండలంలోని కౌట్ల(బి) గ్రామం వరకు 7 కిలోమీటర్ల పొడవుతో నిర్మించ తలపెట్టిన మరో ప్రధానరోడ్డుకు రూ.9కోట్లతో ప్రతిపాదనలు తయారు చేశారు. మొత్తం డబుల్ లేన్ పేరిట రోడ్డు వైడింగ్‌తో పాటు కొత్తరోడ్డును నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. దీనికి సంబంధించి 2018 సంవత్సరంలో ఆర్‌అండ్‌బీ శాఖ టెండర్‌లను నిర్వహించి సంబంధిత కాంట్రాక్టర్‌తో అగ్రిమెంట్ కూడా చేసుకుంది. అయితే అప్పట్లో ఈ రెండు రోడ్ల నిర్మాణాలకు ప్రపంచబ్యాంకు నిధులు మంజూరు అవుతాయని భావించారు. ఈ నిధులపై ఆధారపడి ప్రతిపాదనలతో పాటు టెండర్‌లు సైతం నిర్వహించారు. కాగా ప్రపంచ బ్యాంకు నిధుల విడుదలకు సాంకేతిక కారణాల వల్ల వెనకడుగు వేసింది. ప్రపంచ బ్యాంకు నిధుల విడుదలకు అంగీకరించని కారణంగా ప్రక్రియ నిలిచిపోయింది. ఎట్టకేలకు ఈ సంవత్సరం ప్రపంచబ్యాంకు రెండురోడ్ల నిర్మాణాలకు రూ. 17 కోట్ల నిధుల మంజూరుకు అంగీకరించడంతో ఆర్‌అండ్‌బీ అధికారులు మళ్లీ ఆ దిశగా కార్యాచరణ చేపట్టారు. ఇందులో భాగంగానే నాలుగు సంవత్సరాల క్రితం ఒప్పందం కుదుర్చుకున్న గుత్తేదారులతోనే ఈ రెండు రోడ్ల నిర్మాణాల పనులను చేపట్టాలని చర్చించారు. మొదట్లో గుత్తేదారులు పాతరేట్లతో పనులు చేసేందుకు నిరాకరించినప్పటికీ సంబంధిత అ?ధికారుల అభ్యర్థన మేరకు పనులు ప్రారంభించేందుకు అంగీకరించినట్లు సమాచారం. ఇదిలాఉండగా గత నాలుగేళ్ల క్రితమే అప్పటి మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి ఈ రోడ్డు నిర్మాణ పనులకు శిలాఫలకం సైతం వేశారు. అయితే నిధుల కొరతతో పనులు నిలిచిపోగా ఎట్టకేలకు ప్రపంచ బ్యాంకు ముందుకు రావడం ఈ రెండు రోడ్ల నిర్మాణాలకు ఆటంకాలను తొలగించినట్లయ్యిందం



టున్నారు. నరకకూపంగా ఈ రెండు రహదారులుదాదాదా దశాబ్దకాలం నుంచి ఈ రెండు ప్రధానరోడ్డు మార్గాలు నరకకూపాన్ని తలపిస్తున్నాయంటు న్నారు. ప్రతిరోజూ వందలాది వాహనాలు ఈ రోడ్డుపై ఇరువైపులా తిరుగుతున్న కారణంగా రోడ్డు మొత్తం గుంతలమయంగా మారింది. వాహనాల సంగతి దేవుడెరుగు కాని కాలినడకకు కూడా ఈ రోడ్డుపై తీవ్ర ఇబ్బం దులను కలిగిస్తోంది. ఈద్గాం నుంచి కౌట్ల (కె) వరకు గల ప్రధానరోడ్డు కూడా అధ్వాన్నంగా మారిపోయింది. మొత్తానికి ఏడు కిలోమీటర్ల పొడవుతో ఉన్న ఈ రోడ్డుపై తమ వాహనాలను నడిపేందుకు యజమానులు జంకుతున్నారు. ఇప్పటికే చాలాసార్లు ఈ రోడ్డు నిర్మాణం కోసం స్థానికులు ఆందోళనలు సైతం నిర్వహించారు. ఎట్టకేలకు నాలుగు సంవత్సరాల క్రితం రూ.8 కోట్ల వ్యయంతో రోడ్డు పనులను చేపట్టేందుకు ఆర్ అండ్ బీ అధికారులు సిద్ధమవ్వగా పనుల నిర్వహణ కోసం సైతం టెండర్‌లను కూడా నిర్వహించారు. టెండర్ ప్రక్రియ పూర్తికావడంతో ఇక రోడ్డు పనులు మొదలవుతాయని అందరు ఆశించారు. తీరా వారి ఆశలన్నీ అడి యాశలయ్యాయి. నిధుల కొరత కారణంగా కాంట్రాక్టర్‌లు పనులు చేసేం దుకు వెనకడుగు వేశారు. దీంతో పరిస్థితి ఎక్కడ వేసిన అక్కడే అన్న గొంగలిలా మారిపోయింది. దీంతో పాటు సిర్గాపూర్ నుంచి కౌట్ల (బి) గ్రామం వరకు బీరవెల్లి గ్రామం మీదుగా నిర్మించ తలపెట్టిన ప్రధాన రోడ్డు కూడా అస్థవ్యస్థంగా మారింది. ఈ రోడ్డుపై వాహనాలు తిరిగేం దుకు నరకయాతన అనుభవించాల్సి వస్తోందంటున్నారు. నర్సాపూర్, దిలావర్‌పూర్ మండలాలతో సారంగాపూర్ మండలానికి ఈ రోడ్డు కనెక్టివిటీగా ఉండడంతో ప్రతీరోజూ ఇరువైపుల జనసంచారమే కాకుండా వందలాది వాహనాలు తిరుగుతుంటాయి. అ?ధ్వాన్నరోడ్డు కారణంగా వా హన చోదకులు ఇప్పటి వరకు తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారు. ఎట్టకేలకు ఆర్‌అండ్‌బీ శాఖ మొత్తం రూ.18 కోట్లతో ఈ రెండు రోడ్ల నిర్మాణాలను చేపట్టబోతున్న కారణంగా స్థానికులు ఊపిరి పీల్చుకుంటున్నారంటున్నారు. నాలుగేళ్ల క్రితం శిలాఫలకంకాగా ఈ రెండు రోడ్ల నిర్మాణాలకు మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి నాలుగేళ్ళ క్రితమే శిలాఫలకం వేశారు. ప్రభుత్వం మొదటి నుంచి ఆర్ అండ్ బి శాఖకు నిధుల విడుదల విషయంలో అనాసక్తి ప్రదర్శిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. దీంతో ఆ శాఖ చేపట్టిన పనులకు ఎప్పటికప్పుడు బిల్లులు మంజూరు కాని కారణంగా ఆ పనులు చేపట్టే కాంట్రాక్టర్‌లు తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నారు. దీంతో ఆర్ అండ్ బి శాఖ సైతం ఏమి చేయలేని పరిస్థితిని ఎదుర్కొంటోంది. ఇప్పటికే నిధులు విడుదల చేయాలంటూ ఆర్ అండ్ బి శాఖ అధికారులు ప్రభుత్వానికి పలుసార్లు వినతి కూడా చేశారు. అలాగే మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి దృష్టికి సైతం నిధుల విషయాన్ని తీసుకువెళ్లారు. ఈ క్రమంలోనే రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన చర్యల కారణంగా ప్రపంచ బ్యాంకు ఈ రెండు ప్రధానరోడ్ల నిర్మాణాల కోసం నిధులు మంజూరు చేసేందుకు అంగీకరించింది. దీంతో సంబంధిత అధికారులు ఇక పనులను మొదలుపెట్టేందుకు సిద్దమవుతున్నారు. అ?ధ్వాన రోడ్డుతో అవస్థలు పడుతున్నాం ఈద్గాం నుంచి కౌట్ల వరకు ఉన్న ప్రధాన రోడ్డు అధ్వానంగా మారిపోయింది. దారి పొడగునా భారీ గుంతలతో తాము ఇబ్బందులు పడుతున్నాం. ఇప్పటికే పలుసార్లు ప్రజా ప్రతినిధులు అధికారులు ఈ రోడ్డు నిర్మాణం గురించి హామీ ఇచ్చారు. అయినప్పటికీ ఈ హామీ నెరవేరలేదు. తమ గ్రామానికి చేరుకోవాలంటే ఈ రోడ్డు తమ తమకు వేరే మార్గం లేదు. ఇకనైనా అధికారులు స్పందించి రోడ్డు పనులను చేపట్టాలి. – నర్సారెడ్డి, కౌట్ల (కె)

మూడు మండలాలకు లింకేజీదిలావర్‌పూర్ మండలంలోని సిర్గాపూర్ నుంచి సారంగాపూర్ మండలంలోని బీరవెల్లి మీదుగా కౌట్ల గ్రామం వరకు గల రోడ్డు గందరగోళంగా మారిపోయింది. రోడ్డుపై భారీగుంతల కారణంగా తాము తీవ్ర ఇబ్బం దులు పడుతున్నాం. వాహనాల సంగతి పక్కన పెడితే కాలినడకన నడిచేందుకు కూడా ఈ రోడ్డు అనుకూలంగా లేదు. సంబంధిత శాఖ ఎప్పటికప్పుడు మరమత్తులు చేయని కారణంగానే ఈ సమస్య తీవ్రమయ్యింది. ఇకనైనా అధికారులు , ప్రజా ప్రతినిధులు స్పందించి చర్యలు తీసుకోవాలి. – సీహెచ్. మధుకర్, మలక్ చించోలి

నిధులు మంజూరు కాగానే పనులు చేపడతాంఈ విషయమై రోడ్లు భవనాల శాఖ నిర్మల్ ఈఈ అశోక్ కుమార్‌ను సంప్రదించగా పనులు చేపట్టేందుకు ప్రపంచ బ్యాంకు ఆమోదం లభించిందని , నిధులు మంజూరు కాగానే రోడ్డు నిర్మాణ పనులను చేపట్టనున్నట్లు ఆయన వివరించారు.

– అశోక్‌కుమార్ , ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, రోడ్లు,భవనాల శాఖ , నిర్మల్

# భవితపైనే ధ్యాస...

చిట్యాల : వేసవి సెలవులు వస్తున్నాయంటే చిన్నారులకు సంతోషం. పాఠశాలలో కుస్తీపట్టిన పుస్తకాలను పక్కన పెట్టి కొంతకాలం సరదాగా గడపొచ్చని భావిస్తుంటారు. అమ్మమ్మ ఇంటికో, ఇతర బంధువుల ఇళ్లకో వెళ్లాలని, లేదా యాత్రా ప్రదేశాలు చుట్టి రావాలని వేసవి సెలవులలో ప్రణాళికలు రూపొందించుకుంటుంటారు. కానీ, ప్రస్తుతం తల్లిదండ్రులు, పిల్లల ఆలోచనల తీరు మారింది. వేసవి సెలవులను భవిష్యత్తులో తమకు ఉపయోగపడే విధంగా వినియోగించుకోవాలని భావిస్తున్నారు. దివంగత, మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం అన్నట్లు కలలు కనాలి, వాటి సాకారానికి కృషి చేయాలనే మాటను ఆచరణలో పెట్టాలని చిట్యాల పురపాలికతోపాటు మండలానికి చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థులు భావిస్తున్నారు.

కంప్యూటర్ విద్య నేర్చుకుంటాను:
రాచకొండ రత్నంబాబు, జడ్పీ ఉన్నతపాఠశాల, వట్టిమర్తి ....మా వార్షిక పరీక్షలు ఈనెల 20తో ముగియనున్నాయి. తర్వాత వచ్చే వేసవి సెలవులను నా భవిష్యత్తు కోసం ఉపయోగించుకుంటాను. కంప్యూటర్ విద్య నేర్చుకోవాలని మా నాన్న సూచించారు. దాని ప్రకారం వేసవి సెలవులను కంప్యూటర్ విద్య నేర్చుకోవాలని నిర్ణయించుకున్నాను.

కోడింగ్‌పై దృష్టి:



కందగట్ల కీర్తన, జడ్పీ ఉన్నత పాఠశాల, నేరడ..రానున్న వేసవి సెలవులను వృథా చేయకుండా కంప్యూటర్ కోడింగ్, జావా, స్పోకెన్ ఇంగ్లీష్ నేర్చుకోవాలని నిర్ణయించుకున్నాను. సమయాన్ని బట్టి భౌతిక, జీవశాస్త్రం, గణితంలో మెలకువలను నేర్చుకుంటాను. ఎంబ్రాయిడరీ, పెయింటింగ్ వంటివి నేర్చుకోవడానికి సమయాన్ని ప్రణాళిక ప్రకారం కేటాయించుకుంటాను.

కొత్త ఆవిష్కరణలపై...:వేముల సాగర్, జడ్పీ ఉన్నత పాఠశాల, నేరడ..వేసవి సెలవులలో కొత్త ఆవిష్కరణలపై దృష్టి పెట్టాలని భావిస్తున్నాను. అందుబాటులో ఉండే చిన్న, చిన్న వస్తువులతో ఎలక్ట్రికల్ పరికరాలతో సులభంగా, కొత్తగా వస్తువులను తయారు చేయాలని ఆలోచిస్తున్నాను. ఇందుకోసం అంతర్జాల సహకారాన్ని తీసుకుంటాను. దీంతోపాటు కంప్యూటర్ విద్య, మా తరగతి సబ్జెక్టులలో మెలకువలను కూడా ఉపాధ్యాయుల సహకారంతో నేర్చుకోవాలనుకుంటున్నాను.

ఆంగ్ల వ్యాకరణంపై పట్టు సాధిస్తా:
జెట్ట మాధవి,జడ్పీ ఉన్నత పాఠశాల, గుండ్రాంపల్లి..ఆంగ్లంలో కొంత వెనుకబడి ఉన్నాను. రానున్న వేసవి సెలవులను ఆంగ్ల వ్యాకరణంపై పట్టు సాధించడానికి వినియోగిస్తాను. గతేడాది వేసవి సెలవుల్లో మా ప్రధానోపాధ్యాయుడు నరసింగరావు 'స్పోకన్ ఇంగ్లీష్ ' పేరుతో జూమ్ తరగతులను నిర్వహించారు. ఈ సెలవుల్లోనూ నిర్వహించాలని నిర్ణయించారు.

పై తరగతుల సబ్జెక్టులను ఆన్‌లైన్‌లో...:పొలస శ్రీవిద్య, జడ్పీఉన్నత పాఠశాల, చిట్యాల..ఆన్‌లైన్‌లో పదో తరగతి సబ్జెక్టులను ముందుగానే వినాలనుకుంటున్నాను. దీంతో పైతరగతికి వెళ్లాక పాఠాలు సులభంగా అర్థమవుతాయని భావిస్తు న్నాను. దీనికోసం ఉపాధ్యాయుల సలహాలు, సూచనలు తీసుకుం టాను. ఇవి కాకుండా క్లాసికల్ నృత్యం కూడా నేర్చుకోవాలని అనుకుంటున్నాను.

# హరితహారంపై అలసత్వం

మెదక్ :రాష్ట్రాన్ని ఆకుపచ్చ తెలంగాణగా మార్చాలన్న ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక హరితహారం కార్యక్రమం కొన్నచోట్ల అభాసు పాలవుతోంది. నిర్దేశించిన లక్ష్యం కేవలం కాగితాల్లోనే ఉంటోంది. క్షేత్రస్థాయిలో కానరావడం లేదు. ఫలితంగా రూ.లక్షల నిధులు వృథా అవుతున్నాయి. చేర్యాల పురపాలక సంఘంలో 2022లో 15 వేల మొక్కలు నాటాల్సి ఉంది. దాదాపు 4 వేల మొక్కల్ని కొనుగోలు చేసి తీసుకొచ్చారు. స్థానిక సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలో నిల్వ చేశారు. ఆ తర్వాత గుడిచెరువు వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన నర్సరీకి మార్చారు. పట్టించుకునే వారు లేక అప్పటికే సుమారు 70 శాతం పనికి రాకుండా పోయాయి. గత ఏడాది వన మహోత్సవంలో



భాగంగా నామమాత్రంగా పట్టణం నుంచి చుంచనకోటకు వెళ్లే దారిలో రహదారికి ఇరువైపులా, పెద్దచెరువు కట్టపై నామమాత్రంగా నాటారు. ఎమ్మెల్యే వెళ్లిపోగానే నాటకుండానే వదిలేసి వెళ్లిపోవడం గమనార్హం. బల్దియా అధికారులు మాత్రం 180 మొక్కల్ని నాటినట్లు ప్రకటించారు. నాటే వారు లేక చేర్యాల పెద్దచెరువు కట్టపై తీసి గుంతలు వృథాగా ఉన్నాయి. ఏర్పాటు చేసిన ట్రీగార్డులు ధ్వంసమయ్యాయి. నాటడానికి ఈసారి గుత్తేదారుకు అప్పగించామని.. కొన్ని కారణాలతో అతను రాకపోవడంతో పూర్తి స్థాయిలో నాటలేకపోయామని.. వెంటనే సంరక్షణ చర్యలు తీసుకుంటామని కమిషనర్ రాజేంద్రకుమార్ వివరించారు.

# స్థలాలున్నా.. అద్దె భవనాల్లోనే!



కోరుట్ల : జిల్లాలోనే రెండవ పెద్ద పట్టణమైన కోరుట్ల నియోజకవర్గ కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు లేక ఏళ్ల తరబడి అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి.. పట్టణంలో ప్రభుత్వ స్థలాలు ఉన్నప్పటికి సొంత భవనాలు నిర్మించేందుకు నిధులు కేటాయించలేని పరిస్థితి నెలకొంది.. నిత్యం రద్దీగా ఉండే ప్రభుత్వ కార్యాలయాలు ఇరుకైన అద్దె భవనాల్లో కొనసాగడంతో సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.. పనుల నిమిత్తం వచ్చే ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించడంలో అధికార యంత్రాంగం పూర్తిగా విఫలమౌతోంది. నాలుగేళ్లుగా..వ్యవసాయశాఖకు శాశ్వత భవనం లేకపోవడంతో 2005లో మార్కెట్‌యార్డులోని దెబ్బతిన్న రైతు విశ్రాంతి భవనం కేటాయించడంతో అందులో కార్యాలయం ఏర్పాటు చేసుకుని అన్నదాతలకు సేవలందిస్తున్నారు. 2009లో గోదాం ఏరియాలోనున్న 80 గజాల స్థలం కేటాయించి 2011-12లో బీఆర్‌జీఎఫ్ కింద రూ.10 లక్షలు మంజూరు చేయడంతో సొంత భవనం నిర్మించారు. నిధులు సరిపోకపోవడంతో పనులు పూర్తిచేయకుండా వదిలేశారు. 2019లో రూ.3 లక్షలు కేటాయించడంతో పనులు పూర్తి చేశారు. నియోజకవర్గ కేంద్రంలోనే వ్యవసాయశాఖ డివిజన్ కార్యాయాలు (ఏడీఏ) ఏర్పాటు చేయాలని నాలుగేళ్ల కిందట ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసింది. వ్యవసాయశాఖ భవనంలోకి ఏడీఏ కార్యాలయం తీసుకువస్తారని తెలపడంతో దానిని ప్రారంభించకుండా ఖాళీగా వదిలేశారు. ఆరు నెలల కిందట మార్కెట్‌యార్డులోని. 1.20 ఎకరాల విస్తీర్ణంలో రూ.4 కోట్లతో సమీకృత మార్కెట్ల నిర్మాణం చేపట్టడంతో పాత భవనాలను పూర్తిగా తొలగిస్తామని తెలపడంతో ఏవో కార్యాలయం ఖాళీచేసి అద్దె భవనంలో నామమాత్రంగా ఏర్పాటు చేశారు. భవనం లాక్కుని.. గది కేటాయించారు..

కోరుట్ల పట్టణానికి 1971లో గ్రామీణ పశువైద్య కేంద్రం మంజూరు కాగా 1976లో పశువుల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేశారు. 1987లో వేములవాడరోడ్‌లో పశువైద్యశాలకు శాశ్వత భవనం నిర్మించారు. 2008లో ప్రభుత్వ ఆసుపత్రికి 30 పడకల నూతన భవనం నిర్మించేందుకు స్థలం సరిపోదంటూ అప్పటి ప్రజాప్రతినిధులు పశువైద్యశాఖ భవనం స్థలం అవసరం ఉంటుందని లాక్కున్నారు. దీంతో కల్లూర్‌రోడ్‌లో శిథిలావస్థకు చేరిన ఎస్సారెస్పీ క్వార్టర్‌లోకి పశువైద్యశాలను మార్చారు. క్వార్టర్‌ను ఖాళీ చేయాలంటూ ఎస్సారెస్పీశాఖ అధికారులు పలుమార్లు నోటీసులు జారీ చేశారు. సొంత స్థలం కేటాయించాలని పలుమార్లు రెవెన్యూశాఖకు దరఖాస్తు చేసుకున్నా పట్టించుకోలేదు. రెండేళ్ల కిందట ఎస్సారెస్పీ క్వార్టర్‌లను పూర్తిగా తొలగించడంతో పశువైద్యశాలను వేములవాడరోడ్‌లోని పాత ఆసుపత్రి భవనంలోకి మార్చారు. ఏడాది తర్వాత ప్రభుత్వ ఆసుపత్రికి 100 పడకల భవనం మంజూరు కాగా పాత పశువైద్యశాల భవనం పూర్తిగా తొలగించారు. ఏడాది కిందట పాతమున్సిపల్ భవనం పైఅంతస్తులో ఓగది ఇవ్వడంతో అసౌకర్యాల మధ్య పశువైద్యశాలను ఏర్పాటు చేశారు.

16 ఏళ్లుగా..కోరుట్లకు 2007లో రవాణాశాఖ ఉప కార్యాలయం మంజూరైంది. స్థానిక ఆదర్శనగర్‌లోని ఓ అద్దె భవనంలో ఏర్పాటు చేశారు. 16 ఏళ్లుగా అద్దె భవనంలోనే కొనసాగుతుంది. ఈ రవాణా శాఖ పరిధిలోకి కోరుట్ల, కథలాపూర్, మేడిపల్లి, మెట్‌పల్లి, ఇబ్రహీంపట్నం, మల్లాపూర్ మండలాలు వస్తుంటాయి. ఆరు మండలాలకు సేవలందించాల్సిన రవాణాశాఖ కార్యాలయం ఇరుకుగా ఉన్న అద్దె భవనంలో ఏర్పాటు చేయడంతో కనీస సౌకర్యాలు కరవయ్యాయి. వాహనాల సామర్థ్యం, టెస్ట్ డ్రైవింగ్ ట్రాక్ సౌకర్యం లేక ఆరుబయట ప్లాట్లలో ఏర్పాటు చేసి ఎండలో ఎంవీఐ, సిబ్బంది, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సొంత భవన నిర్మాణానికి మాదాపూర్‌రోడ్‌లో ప్రభుత్వ స్థలం కేటాయించి పనులు చేపట్టగా కోర్టు కేసు ఉండటంతో మధ్యలోనే వదిలేశారు. ఏడాది క్రితం రామారావుపల్లెరోడ్‌లో 2.20 ఎకరాల ప్రభుత్వ భూమిని రోడ్డు ఇరువైపులా కేటాయించారు. ఆస్థలం ట్రాక్ నిర్మించేందుకు అనువుగా లేదు. నిధులు కేటాయిచడంలో జాప్యం చేస్తున్నారు.

నెలకు రూ.50 వేలు..
కోరుట్ల పట్టణానికి 2014లో జూనియర్ సివిల్ జడ్జి కోర్టు మంజూరైంది. సి.ప్రభాకర్ స్మాకర గ్రంథాలయ పైఅంతస్తులో అద్దె భవనంలో ఏర్పాటు చేశారు. ఈకోర్టు పరిధిలోకి కోరుట్ల, కథలాపూర్, మేడిపల్లి మండలాలు వస్తాయి. కోర్టుకు వచ్చిన కక్షిదారులు, న్యాయవాదులు, పోలీసులు ఉండేందుకు కనీస వసతులు లేకపోవడంతో ఏళ్ల తరబడి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆరుబయట వాహనాలు నిలిపేందుకు పార్కింగ్ కోసం ఇక్కట్లు పడ్డారు. రెండు నెలల కిందట పాత భవనానికి దగ్గర్లో నూతనంగా నిర్మించిన పెద్ద భవనంలోకి కోర్టును మార్చారు. నెలకు రూ.50వేల చొప్పున అద్దె చెల్లిస్తున్నారు. కోరుట్ల కోర్టుకు శాశ్వత భవనం, న్యాయమూర్తి నివాస గృహం, ఇతర నిర్మాణాలు చేపట్టేందుకు 2016లో మెట్‌పల్లిరోడ్‌లో 2 ఎకరాల ప్రభుత్వ స్థలం కేటాయించారు. ఇప్పటివరకు ప్రభుత్వం నిధులను కేటాయించకపోవడంతో ఖాళీగా వదిలేశారు.

# పరిహారం అందక.. పనులు సాగక



సిరిసిల్ల : కాళేశ్వరం ప్రాజెక్టులో గోదావరి నుంచి కొండపోచమ్మకు కాల్వలు, పంపుహౌజ్‌ల ద్వారా ప్రస్తుతం రెండు టీఎంసీలు తరలిస్తున్నారు. దీనికి సమాంతరంగా మరో టీఎంసీని తరలించేందుకు 2019-20లో ప్రణాళికలు చేశారు. ఆ ఏడాదే టెండర్లు కూడా పూర్తయ్యాయి. కరీంనగర్ జిల్లా రామడుగు మండలం తిరుమలాపూర్ నుంచి రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం వరదవెల్లి వరకు కాల్వ తవ్వకం పనులు మందకొడిగా సాగుతున్నాయి. 23.91 కిలోమీటర్ల పొడవును రెండు ప్యాకేజీలు చేశారు. దీనిలో ఇప్పటికీ 40 శాతం భూసేకరణకు సంబంధించి సుమారు రూ.150 కోట్ల వరకు పెండింగ్‌లో ఉన్నాయి. పరిహారం చెల్లింపులు పూర్తయిన చోట పనులు జరుగుతున్నా తవ్విన మట్టిని పోసేందుకు స్థలం సరిపోవడం లేదు. గతేడాదే గుత్తేదారుకిచ్చిన గడువు ముగిసింది. దానిని ఈ ఏడాది డిసెంబరు వరకు పొడిగించారు. మొత్తంగా ఇప్పటికీ 20 శాతం పనులు కూడా జరగలేదు.

సమస్యలు ఇవీ...అదనపు టీఎంసీ కాల్వ నిర్మాణానికి తొలుత 1,200 ఎకరాలు గుర్తించారు. 2005లో పాత వరద కాల్వ కోసం ఎకరానికి గరిష్ఠంగా రూ.10 లక్షల లోపు ప్రభుత్వం పరిహారం చెల్లించి సేకరించింది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తయి.. సాగునీటి ఇబ్బందులు తొలగడంతో వ్యవసాయ భూముల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. దీనికితోడు ప్రభుత్వ భూసేకరణకు రైతుల నుంచి వ్యతిరేకత ఎదురవుతోంది.మట్టిని పోసేందుకు ఇబ్బందులు రావడంతో జలవనరులశాఖ పాత వరద కాల్వ భూముల వివరాలతో సర్వే చేసింది. మట్టిని తవ్వి సాగుభూములుగా మార్చేశారు. కొన్ని చోట్లయితే ఏకంగా రెవెన్యూ దస్త్రాల్లోనే నమోదు చేసుకున్నట్లు తేలింది. బోయినపల్లి, గంగాధర, రామడుగు మండలాల్లో వందల ఎకరాలు ఆక్రమణకు గురైనట్లు తేలింది. కొన్ని చోట్ల పంచాయతీల వైకుంఠధామాలు, పల్లె ప్రకృతి వనాలు, డంపింగ్ యార్డులు, విద్యుత్తు ఉప కేంద్రాలు నిర్మించారు. ప్రజా అవసరాలను పక్కన పెడితే మిగతా ఆక్రమణలను తొలగించేందుకు రెవెన్యూ, జలవనరులశాఖల అధికారులు కసరత్తు చేస్తున్నారు. పనులు వేగంగా జరగాలంటే మట్టి తరలింపుల్లో ఇబ్బందులు ఉండకూడదు. లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి, బండరాళ్లను జలవనరులు, రెవెన్యూ, గనుల శాఖలు సమన్వయంతో వేబిల్లుల ద్వారా ప్రభుత్వ, ప్రైవేటు అవసరాలకు విక్రయించాలని ప్రణాళికలు చేశారు. రైల్వేలైను భూసేకరణ కొలిక్కిరాకపోవడం మరో ప్రధాన సమస్యగా మారింది.ప్రణాళికతో ముందుకు...విష్ణు, డీఈ, అదనపు టీఎంసీ కాల్వ ....పరిహారం చెల్లించిన ప్రాంతాల్లో పనులు చేస్తున్నాం. మట్టిని పోసేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ సమస్యను అదిగమించేందుకు ప్రత్యామ్నాయ ప్రణాళికలు చేస్తున్నాం. పరిహారం నిధులు విడుదలైతే పనులు వేగంగా జరిగే అవకాశం ఉంటుంది. రాజరాజేశ్వర జలాశయం కుడివైపు మూడో ప్యాకేజీలోనూ ఆటంకాలు ఏర్పడుతున్నాయి. రాజరాజేశ్వర నుంచి అన్నపూర్ణ జలాశయం వరకు కాల్వ కోసం 470 ఎకరాలు సేకరించారు. ఇందులో అప్పటికే రాజరాజేశ్వరలో భూములు కోల్పోయిన చీర్లవంచ, చింతల్‌ఠాణాకు చెందిన నిర్వాసితులు ఇల్లంతకుంట మండలం ఒబులాపూర్, అనంతరం, తిప్పాపూర్‌లలో వ్యవసాయ భూములు కొనుగోలు చేశారు. వీటి పక్క నుంచే అదనపు టీఎంసీ కాల్వ తవ్వుతున్నారు. ఇందులోని మట్టిని పోసేందుకు 60 ఎకరాలు సేకరించేందుకు రెవెన్యూశాఖ సర్వే చేసింది. నిర్వాసితులు భూమి ఇవ్వమంటూ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీంతో స్థలం లేక రాజరాజేశ్వర జలాశయం ఎఫ్ఆర్ఎల్ (ఫుల్ రిజర్వాయర్ లెవల్)కు పైన పోస్తున్నారు. కానీ భారీ వరదలకు ఈ మట్టి అంతా జలాశయంలోకి వెళ్లి పూడికగా మారే అవకాశం ఉంది.రెండు టీఎంసీలున్న వరద కాల్వకు 300 నుంచి 400 మీటర్ల వెడల్పుతో రెండువైపులా భూసేకరణ జరిగింది. అదనపు టీఎంసీకి 110 నుంచి 180 మీటర్ల వెడల్పుతో ప్రణాళికలు చేశారు. ప్రభుత్వానికి ఆర్థికంగా భారం తగ్గించేందుకు 1,200 ఎకరాలను 600 ఎకరాలకు కుదించారు. ఇదే ప్రస్తుతం పనులు చేసేందుకు ఆటంకంగా మారుతోంది.

# రోగ నిర్ధారణ పరీక్షలు ఇక్కడే

భువనగిరి : రోగ నిర్ధారణ పరీక్షల కోసం నిర్మించిన డయాగ్నోస్టిక్ హబ్ భవనం నిర్మాణం దాదాపుగా పూర్తయింది. జిల్లా ఆసుపత్రి ఆవరణలో గతేడాది మార్చి 20న వైద్యఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు పనులకు శంకుస్థాపన చేశారు. రూ.1.25 కోట్ల నిధుల అంచనాతో పనులు ప్రారంభించారు. తెలంగాణ రాష్ట్ర వైద్యసేవల మౌలిక వసతుల అభివృద్ధి కార్పొరేషన్(టీఎస్ఎమ్ఎస్ఐడీసీ) ఆధ్వర్యంలో నిర్మాణ పనులు సాగాయి. గ్రౌండ్‌ఫ్లోర్, మొదటి అంతస్తులో మౌలిక వసతులను ఏర్పాటు చేస్తున్నారు. పరీక్షలకు కావాల్సిన రీతిలో విద్యుత్తు పనులు జరుగుతున్నాయి. వ్యాధి నిర్ధారణకు వినియోగించే పరికరాలు, అధునాతన యంత్రాలు కొన్ని ఇప్పటికే భవనంలోకి చేర్చారు. వాటిని అమర్చేందుకు కావాల్సిన పనులు చేస్తున్నారు.

అందుబాటులోకి రానున్న పరీక్షలు.. జిల్లా కేంద్రాసుపత్రిలో ప్రస్తుతం రక్తం, మూత్రానికి సంబంధించిన దాదాపుగా 19 రకాల పరీక్షలు చేస్తున్నారు. వీటితో పాటు, అల్ట్రాసౌండ్, రక్తంలోని ప్లేట్‌లెట్లు, సీఆర్పీ, ఆర్ఏ, ఏసీవో వంటి 20 రకాలు పరీక్షలు అందుబాటులోకి రానున్నట్లు వైద్యాధికారులు చెబుతున్నారు.



రేడియోగ్రాఫర్, మైక్రోబయాలజిస్టు, టెక్నీషియన్, ఫార్మసిస్ట్, కంప్యూటర్ ఆపరేటర్ నియామక ప్రక్రియ పూర్తయినట్లు సూపరింటెండెంట్ చిన్నానాయక్ తెలిపారు. త్వరలో ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు.

# పురాల్లో.. పానీపాట్లు

మెదక్ : కోట్లాది రూపాయలు వెచ్చించి తాగునీటి పథకాలను నిర్మించినా.. పురవాసులకు 'పానీ'పాట్లు తప్పడం లేదు. సరఫరాలో తరచూ అంతరాయం.. గతంలో వేసిన పైప్‌లైన్ల మీదుగా సీసీ రహదారులు, మురుగు కాలువలు నిర్మించడంతో లీకవుతున్నాయి. విద్యుత్తు సమస్య కారణంగా సరిగా పంపిణీ కావడం లేదు. అవసరమైన చోట మరమ్మతులు చేసి సరఫరాను పునరుద్ధరించాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుత వేసవిలో ప్రణాళికతో అడుగేస్తేనే ఇబ్బందులు ఉండవు. జిల్లాలోని నాలుగు పురపాలికల్లో తాగునీటి సమస్యపై పరిశీలన కథనం.మరమ్మతులు చేపట్టినా..

ప్రస్తుత పరిస్థితి: రూ.60 కోట్లతో జలజాలం పనులు చేపట్టగా, తరచూ ప్రధాన పైప్‌లైన్లు ధ్వంసమై నీళ్లు లీకవుతున్నాయి. దీంతో మరమ్మతులు చేపట్టినా యథాస్థితి నెలకొంటోంది. పట్టణంలోని వడ్డెర, దుర్గా కాలనీల్లో సమస్య తీవ్రంగా ఉంది. ట్యాంకర్లే దిక్కయ్యాయి. పిల్లికొట్టాలలోని రెండు పడక గదుల ఇళ్లను ప్రారంభించగా ట్యాంకు ద్వారా నీటిని అందిస్తున్నారు. ఇక్కడ ఉంటున్న 400 కుటుంబాలకు సరిపోవడం లేదు. రెండు సార్లు సరఫరా చేస్తే సరిపోతుంది. ట్యాంకర్లతో తాగునీటిని పంపిణీ చేస్తున్నారు. 18వ వార్డులో వెస్లీ పాఠశాల వద్ద, 6వ వార్డులో పలు ఇళ్లకు నీటి కనెక్షన్లు ఇవ్వలేదు. పట్టణంలోని అన్ని వార్డుల్లో పైపులైన్లు వేసి ఇళ్ల వరకు కనెక్షన్ ఇచ్చినా మీటర్లకు అనుసంధానం చేయలేదు. సరఫరాలో హెచ్చుతగ్గులతో లోపాలు ఎదురవుతున్నాయని మున్సిపల్ డీఈఈ మహేశ్ తెలిపారు. వెంటనే పరిష్కరిస్తున్నామని పేర్కొన్నారు.

మెదక్
70,000
12 ఎంఎల్‌డీ



12 ఎంఎల్‌డి
22 : 9,200
సాంకేతిక సమస్యలతో..
నర్సాపూర్ అంబేడ్కర్ కాలనీలో భగీరథ నల్లా కనెక్షన్లు

ప్రస్తుత పరిస్థితి: పట్టణంలోని 15 వార్డుల్లో భగీరథ పథకంలో ఆరు ట్యాంకులు నిర్మించారు. 9వ వార్డులోని ఇటికెలొల్ల వాడ, 10వ వార్డులో మందులొల్ల బస్తీ, 13, 14, 5వ వార్డులలో నీటి సమస్యలు ఉన్నాయి. తపాలా కార్యాలయం వీధిలోని ట్యాంకు ద్వారా 13, 14 వార్డులకు పంపిణీ చేస్తున్నారు. 550 కనెక్షన్లకు 1,100 ఉండటం సమస్యగా మారింది. చక్రియాల ఇన్‌టేక్‌వెల్ వద్ద తరచూ సాంకేతిక, విద్యుత్తు సమస్యల కారణంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మంజీరా సరఫరా నిలిచిన సమయంలో అవస్థలు పడాల్సిందే. సమస్య ఉన్న వార్డులకు మూడు ట్యాంకర్లతో సరఫరా చేస్తున్నామని కమిషనర్ వెంకట్‌గోపాల్ తెలిపారు.

నర్సాపూర్
ఆదరబాదరాగా పైప్‌లైన్ పనులు..

ప్రస్తుత పరిస్థితి: 16 వార్డులు ఉండగా.. 35 వేల మందికి పైగా నివసిస్తున్నారు. మొదట్లో పలు కాలనీల్లో లీకేజీలతో నీళ్లు రాక ఇబ్బందులు పడ్డారు. ఇటీవల మురుగు కాలువలు, సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టగా.. కనెక్షన్లు దెబ్బతిన్నాయి. పలు కాలనీల్లో నీళ్లు వృథాగా పోతున్నాయి. రెండు పడక గదుల ఇళ్ల వద్ద ఆదరబాదరాగా పైప్‌లైన్ పనులు చేశారు. దీంతో పలు చోట్ల నీరు రాక ప్రజలు అవస్థలు పడుతున్నారు. డ్రమ్ములు, బిందెల్లో పట్టుకుంటున్నారు. పలు నిర్మాణాలు చేపట్టడంతో కొన్ని కాలనీల్లో ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, త్వరగా వాటిని పూర్తిచేయించి మరమ్మతులు చేయిస్తామని, అవస్థలు లేకుండా చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ మోహన్ తెలిపారు.

పంచాయతీ లెక్కల ప్రకారమే..
ప్రస్తుత పరిస్థితి: రామాయంపేట పురపాలికగా ఏర్పడినా ఇప్పటికీ గ్రామ పంచాయతీ లెక్కల ప్రకారమే భగీరథ నీటిని సరఫరా చేస్తున్నారు. పురపాలిక నిబంధనల ప్రకారం జనాభా ప్రాతిపదికన ఒక్కో వ్యక్తికి 135 లీ. నీటిని సరఫరా చేయాల్సి ఉండగా, 2017లో పొందుపరిచిన దాని ప్రకారం పంపిణీ చేస్తున్నారు. ప్రస్తుతం 100 లీటర్లే వస్తున్నాయి. డిమాండ్‌కు అనుగుణంగా కాకుండా 4.50 లక్షల లీటర్ల మేర లోటు ఏర్పడుతోంది. స్థానిక వార్డుల్లో అవసరాన్ని బట్టి బోర్ల ద్వారా సరఫరా చేస్తున్నారు. వేసవిలో నీటిఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటామని ఇన్‌ఛార్జి కమిషనర్ ఉమాదేవి తెలిపారు. వృథాను అరికట్టేందుకు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు.

# గురుకులం.. ఆర్థికంగా పరిపుష్టం

జిన్నారం : తెలంగాణ ఏర్పాటైన తర్వాత ప్రారంభమైన గిరిజన గురుకులాలకు శుభవార్త. మౌలిక వసతుల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం భారీగా నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఒక్కో గురుకులానికి రూ.5 కోట్ల చొప్పున నిధులు ఇచ్చేందుకు అంగీకారం తెలిపింది. ప్రధానంగా అదనపు భవనాల నిర్మాణానికి ఈ నిధులు వెచ్చించనున్నారు. 2023- 24 విద్యా సంవత్సవానికి అందుబాటులోకి భవనాలు వచ్చేలా టెండర్లు, పనుల కార్యాచరణకు శ్రీకారం చుడుతున్నారు.

ఆరు నెలల్లో పూర్తయ్యేలా..
ఉమ్మడి మెదక్ జిల్లా పరిధిలోని పలు గిరిజన గురుకులాలకు మేలు జరుగుతుందని అధికార వర్గాలు భావిస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలోని జిన్నారం, నర్సాపూర్, చేగుంటలో 2014కు ముందు ఉన్న గురుకులాలు. తర్వాత కౌడిపల్లి, నారాయణఖేడ్, కంగ్టి, బాచేపల్లిలో ఏర్పాటు చేశారు. బాలురు, బాలికలకు కౌడిపల్లి, నర్సాపూర్, సిర్గాపూర్, మనూర్, జహీరాబాద్, మెదక్ ప్రాంతాల్లో ఉన్నాయి. గిరిజన గురుకుల డిగ్రీ కళాశాలను మౌలిక వసతులు లేవనే కారణంగా సంగారెడ్డిలో కాకుండా పటాన్‌చెరు మండలం పెద్ద కంజర్ల సమీపంలో నిర్వహిస్తున్నారు. ఒక్కో గురుకులంలో 500 నుంచి 600 మంది విద్యార్థులు ఉన్నారు. చాలీ చాలని గదులతో ఇబ్బంది పడుతున్నారు. ఒక్కోసారి తరగతులను ఆరుబయట, చెట్ల కింద నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది. 2018లో మండల కేంద్రమైన జిన్నారం గిరిజన గురుకులం స్థాయి పెంచి ఇంటర్ తరగతులు ప్రారంభించారు. గదుల సమస్య నెలకొంది. సుమారు 150 మంది వరకు ఇంటర్ విద్యార్థులకు వసతి, తరగతుల నిర్వహణ కష్టమవుతోంది. సమస్యను పలు మార్లు ఉన్నతాధికారులకు నివేదించారు. నిధుల మంజూరు విషయమై తమకు ఎటువంటి ఉత్తర్వులు రాలేదని గురుకుల వర్గాలు చెబుతున్నాయి. సుమారు 30 ఎకరాల విస్తీర్ణంలో స్థలం ఉండటం వల్ల గదుల నిర్మాణానికి నిధులు రావడమే ఆలస్యమని అంటున్నారు. కనీసం ఆరు నెలల్లో భవనాల సమస్య తీరుతుందని భావిస్తున్నారు.

# తల్లిపాల మిత్ర ఆసుపత్రిగా జనగామ ఎంసీహెచ్

జనగామ : అప్పుడే పుట్టిన శిశువులకు తల్లిపాలు ఎంతో ముఖ్యం. అయితే ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో ప్రస్తుతం జరుగుతున్న కాన్పుల్లో నవజాత శిశువులకు తల్లిపాలు పట్టించడంపై అంతగా శ్రద్ధ చూపడం లేదు. దీంతో తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పనపై ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తోంది. ఏటా దేశ వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు ప్రసూతి ఆసుపత్రుల్లో న్యాక్ ఆధ్వర్యంలో పరిశీలన చేపడతారు. బిడ్డలకు తల్లిపాలు పట్టే విషయంలో ముందున్న ఆసుపత్రులకు 'బ్రెస్ట్ ఫీడింగ్ ఫ్రెండ్లీ హాస్పిటల్'గా గుర్తింపుని స్తారు. ఈ ఏడాది కూడా దేశ వ్యాప్తంగా ప్రసూతి ఆసుపత్రుల్లో తల్లిపాలు పట్టేందుకు వసతులు కల్పిస్తూ, అవగాహన కల్పిస్తున్న పది దవాఖానలను గుర్తించారు. ఈ జాబితాలో రాష్ట్రంలోని రెండు ఆసుపత్రులు గుర్తింపు దక్కించుకున్నాయి. ఇందులో బాన్సువాడ మెటర్నిటీ ఆసుపత్రి, జనగామ ఎంసీహెచ్ ఉన్నాయి.

బీఎఫ్‌హెచ్ గుర్తింపునకు దోహదపడిన అంశాలివి..

జనగామ ఎంసీహెచ్‌లో కాన్పు అయిన బాలింతలకు తల్లిపాలు పట్టే విషయంలో ప్రత్యేకంగా గైనకాలజీ వైద్యులతో పాటు మిడ్ వైఫరీ నర్సులు అవగాహన కల్పిస్తున్నారు. నవజాత శిశువు పుట్టగానే ముర్రుపాలు తాగించాలని సూచిస్తున్నారు. ప్రసవించిన తర్వాత ఆసుపత్రిలో ఉన్న రోజుల్లో తల్లిపాలు ఇచ్చే సమయంలో బాలింతల ఇబ్బందులను గమనించి పరిష్కరిస్తున్నారు. పాలు రాకపోతే వచ్చే విధంగా పలు పద్ధతుల్లో చికిత్స అందిస్తూ, కావాల్సిన నిబ్‌లను సమకూరుస్తున్నారు. వీటితో పాటు తల్లిపాలు పట్టేందుకు ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేశారు. కాన్పు అయిన తర్వాత ఎంసీహెచ్‌కు పరీక్షల నిమిత్తం వచ్చే బాలింతలకు రోజూ తల్లిపాలు పడుతున్నారా అనే కోణంలో పర్యవేక్షిస్తున్నారు. ఆసుపత్రిలో తల్లిపాలు పట్టే శిశువుల వివరాలతో పక్కాగా రికార్డులను నిర్వహిస్తున్నారు. వీటన్నింటినీ న్యాక్ (నేషనల్ అక్రెడిటేషన్ కౌన్సిల్) పరిశీలించింది. తల్లిపాలు పట్టే విషయంలో



అన్ని రకాలుగా ముందున్నందున ఎంసీహెచ్‌కు దేశంలోని పది ఆసుపత్రుల సరసన చోటు కల్పించింది. దేశంలో ఎంపికైన పది ప్రసూతి వైద్యశాలల్లో జనగామ ఎంసీహెచ్ ఆసుపత్రి మాత్రమే ప్రభుత్వ పరిధిలో ఉండటం మరో విశేషం. ఉత్తమ గుర్తింపు పొందిన ఎంసీహెచ్ వైద్యులను ఇటీవల రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి దయాకర్‌రావు, ఎమ్మెల్యే యాదగిరిరెడ్డి అభినందించారు. ఇదే స్ఫూర్తితో పని చేయాలని సూచించారు.

అత్యాధునిక వసతులతో..

మాతాశిశు ఆరోగ్య సేవలకు గాను అత్యాధునిక వసతులతో ఐదేళ్ల క్రితం జనగామలో 200 పడకల సామర్థ్యంతో ఎంసీహెచ్ ఆసుపత్రిని ఏర్పాటు చేశారు. నవజాత శిశువులకు మెరుగైన వైద్య సేవలందించేందుకు ఎన్ఎన్‌సీయూ విభాగాన్ని ఏర్పాటు చేశారు. కార్పొరేట్ ఆసుపత్రి తరహాలో అత్యాధునిక పడకలు, వెంటిలేటర్లు ఇతర వసతులు ఉన్నాయి. జిల్లా పరిధిలోని 12 మండలాల నుంచే కాకుండా పొరుగున ఉన్న సిద్ధిపేట, యాదాద్రి-భువనగిరి జిల్లాలకు చెందిన మరో ఆరు మండలాల ప్రజలకు ఎంసీహెచ్ పెద్ద దిక్కుగా మారింది. ప్రతి నెలా ఆసుపత్రిలో 350 నుంచి 400 వరకు కాన్పులు జరుగుతున్నాయి. ప్రతి రోజూ ఓపీ సేవలో 250 నుంచి 300 మంది గర్భిణులు పరీక్షలు చేయించుకుంటారు.

సమష్టి కృషితోనే ఇది సాధ్యమైంది

- డాక్టర్ సుగుణాకర్‌రాజు, ఎంసీహెచ్ ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్

జనగామ ఎంసీహెచ్‌లో తల్లిపాలు పట్టే విషయంలో బాలింతలకు అన్ని రకాలుగా అవగాహన కల్పిస్తున్నాం. ఇందుకోసం ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేశాం. తల్లిపాలు పట్టే శిశువుల వివరాలను రికార్డుల్లో నమోదు చేస్తున్నాం. న్యాక్ బృందం సభ్యులు.. ఆసుపత్రిలో తల్లిపాలు పట్టేందుకు కల్పించిన వసతులు, రికార్డులను పరిశీలించారు. బీహెచ్‌ఎఫ్ గుర్తింపు పొందిన ఆసుపత్రుల్లో ఎంసీహెచ్ మాత్రమే ప్రభుత్వ వైద్యశాలల కేటగిరీలో ఉంది. వైద్యులు, సిబ్బంది సమష్టి కృషితోనే ఇది సాధ్యమైంది.

# కరెంటు సరఫరా లేక రోగుల అవస్థలు

జనగామ : నర్సంపేట ప్రభుత్వ ఆసుపత్రికి శుక్రవారం విద్యుత్తు సరఫరా నిలిచిపోవడంతో రోగులు నానా అవస్థలు పడ్డారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సరఫరా లేకున్నా వైద్యులు, సిబ్బంది పట్టించుకోలేదని ఆరోపణలు వెల్లువెత్తాయి. ఆసుపత్రి ఆవరణలో ఉన్న విద్యుత్తు నియంత్రిక తీగ కాలిపోవడంతో సరఫరా నిలిచిపోయిందని సిబ్బంది తెలిపారు. ఉదయం సమస్య తలెత్తగా మధ్యాహ్నం 3 గంటలకు మరమ్మతులు చేపట్టడం పట్ల రోగులు, వారి బంధువులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆసుపత్రిలో ఉన్న రెండు జనరేటర్ల నుంచి అత్యవసర వార్డు, లేబర్ రూమ్, శస్త్ర చికిత్సల



థియేటర్, డయాలసిస్ వార్డులకు కనెక్షన్ ఉంది. మిగిలిన వార్డులకు ఆ సౌకర్యం లేనందున రోగులు, చిన్న పిల్లలు, బాలింతలు ఎదుర్కొన్న ఇక్కట్లు వర్ణనాతీతం. భాజపా నాయకులు జగన్, సందీప్, రాజు తదితరులు ఆసుపత్రిని సందర్శించి సిబ్బందిని ప్రశ్నించారు. బాలింతలు, చిన్న పిల్లల వార్డులకు జనరేటర్ కనెక్షన్ ఇవ్వకుండా వైద్యులు, నర్సింగ్ సూపరింటెండెంట్ గదులు, ఆసుపత్రి సూపరింటెండెంట్ కార్యాలయానికి కనెక్షన్ తీసుకుని రోగులను విస్మరించారని వారు ఆరోపించారు. ఈ విషయమై ఆసుపత్రి సూపరింటెండెంట్ గోపాల్ వద్ద ప్రస్తావించగా.. రెండు జనరేటర్లతో అత్యవసర వార్డులు, డయాలసిస్, ఆపరేషన్ థియేటర్ నడిపించామన్నారు. మరమ్మతులు చేయించి కరెంటు సరఫరాను పునరుద్ధరించినట్లు చెప్పారు.

# ప్రయోగం తుస్... నైపుణ్యం నిల్!



కొత్తగూడెం : భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాలు పారిశ్రామికంగా దినదినాభివృద్ధి చెందుతున్నాయి. త్వరగా ఉపాధి అవకాశాలు లభిస్తుండటంతో ఐటీఐ విద్యకు డిమాండ్ ఉంది. పరిశ్రమల అవసరాలకు తగ్గట్టు మానవ వనరులను తీర్చిదిద్దటం ఐటీఐ కళాశాలల ప్రత్యేకత. ప్రైవేట్ కళాశాలలకు దీటుగా ప్రభుత్వ కళాశాలల్లోనూ విద్యార్థులు ప్రవేశాలు పొందుతున్నారు. ప్రతి కోర్సుకు సంబంధించి ప్రయోగాలు చేయించాల్సి ఉంటుంది. ప్రయోగ పరీక్షలో ఉత్తీర్ణత తప్పనిసరి. ఇంతవరకు బాగానే ఉన్నా.. ప్రయోగ పరికరాల కొనుగోలుకు ప్రభుత్వ కళాశాలల్లో నిధుల కొరత వేధిస్తోంది. ఐదేళ్లుగా అరకొర వసతులతో నెట్టుకురావాల్సిన పరిస్థితులు దాపురించాయి.

ఉభయ జిల్లాల్లో నాలుగు ప్రభుత్వ ఐటీఐ కళాశాలలు, 28 ప్రైవేట్ ఐటీఐ కళాశాలలున్నాయి. ప్రభుత్వ కళాశాలల్లో పాత పరికరాలతో ప్రయోగాలు చేయిస్తున్నారు. కొత్త పరికరాల కొనుగోలుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పైసా నిధులు కేటాయించటం లేదని కళాశాలల యాజమాన్యాలు చెబుతున్నాయి. కనీసం చిన్న వైరు ముక్క కొనలేని దుస్థితి దాపురించిందని వాపోతున్నాయి. ప్రయోగాలు చేయలేక.. నైపుణ్యం లేక ఏటా విద్యార్థులు అప్రెంటిస్‌షిప్ కోసం పోటీపడుతున్నారు. సుదూర ప్రాంతాలకు వెళ్లి శిక్షణ తీసుకోవాల్సి వస్తోంది.

అందుబాటులోని కోర్సులు

ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, కోపా, టర్నర్, డీజిల్ మోటరు మెకానిక్, మెషినిస్ట్, ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్, ఎలక్ట్రానిక్ మెకానిక్ డ్రాఫ్ట్‌మెన్, మెకానిక్, వెల్డర్, హెల్త్ అండ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్, కట్టింగ్ డ్రెస్ మేకింగ్, మోటర్ మెకానికల్.

నేను టర్నర్ కోర్సు అభ్యసిస్తున్నా. కళాశాలలో మరమ్మతులకు గురైన పాత పరికరాలతో అధ్యాపకులు ప్రయోగాలు చేయిస్తున్నారు. ప్రభుత్వం స్పందించి ప్రయోగ పరికరాల కొనుగోలుకు నిధులు మంజూరు చేయాలి.

చంద్రగిరి రక్షిత్, విద్యార్థి, కొత్తగూడెం రుద్రంపూర్ ప్రభుత్వ ఐటీఐ కళాశాల

పరిశ్రమలకు నెలవుగా ఉన్న జిల్లాలో ఉపాధి అవకాశాలు లభిస్తాయనే ఉద్దేశంతో ఐటీఐ కళాశాలల్లో చేరుతున్నాం. మా కళాశాలలో పదకొండు కోర్సులున్నాయి. ప్రతి కోర్సు విద్యార్థులూ ప్రయోగాలు చేయాల్సి ఉంటుంది. ప్రయోగ పరికరాల లేమితో ఇబ్బందులు పడుతున్నాం.

తాటికొండ కల్పన, విద్యార్థిని, కొత్తగూడెం రుద్రంపూర్ ప్రభుత్వ ఐటీఐ కళాశాల

ప్రభుత్వం 2018 వరకు దశల వారీగా నిధులకు కోత పెడుతూ వచ్చింది. ఐదేళ్లుగా ప్రయోగ పరీక్షలకు అసలు నిధులు మంజూరు కావడం లేదు. గోనెల రమేశ్, ఐటీఐ విద్య జిల్లా నోడల్ అధికారి, భద్రాద్రి కొత్తగూడెం

# ఎన్నాళ్లీ నిరీక్షణ..?



ఖమ్మం : వాహన చోదకుల్లో శిక్షణ నైపుణ్యాలు పెంచాలనే ఉద్దేశంతో అత్యాధునిక హంగులతో ఐడీటీఆర్(ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డ్రైవింగ్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్) కేంద్రాన్ని ఖమ్మంలో ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. కానీ ఐడీటీఆర్ కేంద్రం నిర్మాణానికి గ్రహణం వీడటం లేదు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు విడుదలై రెండున్నరేళ్లు దాటినా నేటికీ పనుల్లో మాత్రం పురోగతి ఎక్కడా కన్పించడం లేదు. ప్రధానంగా జిల్లా కేంద్రం సమీపంలో స్థలం దొరక్కపోవడంతో ప్రాజెక్టు నిర్మాణానికి ముందడుగు పడటం లేదు. ఏడాదిన్నర కిందట ఖమ్మం నగర శివారు సమీపంలో రవాణా శాఖ అధికారులు స్థలం పరిశీలించినప్పటికీ అది అనువుగా లేదు. దీంతో రాష్ట్ర రవాణాశాఖ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన డ్రైవింగ్ శిక్షణ ప్రాజెక్టు కోసం వాహనదారులు నిరీక్షించక తప్పడం లేదు.

సిరిసిల్లలో గత ఏడాది...

తెలంగాణలో తొలి ఐడీటీఆర్ ప్రాజెక్టు సిరిసిల్ల జిల్లా కేంద్రంలో నిర్మితమై గత ఏడాది ప్రారంభించారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ చొరవతో ఖమ్మం జిల్లాలో రెండో కేంద్రం ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఆధునిక హంగులతో కేంద్రం నిర్మాణానికి రూ.20 కోట్లు ఖర్చవుతుందని ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఇందులో భవన నిర్మాణాలకు రూ.14 కోట్లు, సిమ్యులేటర్‌కు రూ.3 కోట్లు, వర్క్‌షాప్ నిర్వహణకు రూ.1.50 కోట్లు, ఇతర అభివృద్ధి పనులకు రూ.1.50 కోట్ల చొప్పున ప్రతిపాదనలు రూపొందించారు. కేంద్రం ఏర్పాటుకు ప్రధాన రహదారికి 200 మీటర్లు సమీపంలో 10-15 ఎకరాల స్థలం అవసరం అవుతుందని జిల్లా రవాణా శాఖ అధికారులు గుర్తించారు. ఇందుకు సంబంధించి ఖమ్మం నగర శివారు దానవాయిగూడెం సబ్ జైలు సమీపంలో ఏడాదిన్నర కిందట ఓ ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. కానీ అది ట్రాక్ నిర్మాణానికి అనువుగా లేకపోవడం, స్థలం తక్కువగా ఉండటంతో మరోచోట స్థలం అప్పగించాలని రెవెన్యూ శాఖతో పాటు జిల్లా ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. నాటి నుంచి రెండున్నరేళ్లు అవుతున్నా ముందడుగు పడలేదు. ఖమ్మం జిల్లా కేంద్రానికి సమీపంలో 15 ఎకరాల ప్రభుత్వ స్థలాలు లేకపోవడంతో ఇబ్బందికరంగా మారిందని జిల్లా రవాణా శాఖ అధికారులు చెబుతున్నారు. స్థలం దొరికిన వెంటనే ఐడీటీఆర్ కేంద్రం నిర్మాణ పనులు ప్రారంభించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొంటున్నారు.

ఐడీటీఆర్ అంటే..?

18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్సు పొందాల్సి ఉంటుంది. ద్విచక్ర వాహనాల వరకు డ్రైవింగ్ పర్వాలేదు కానీ కార్లు, ట్రాన్స్‌పోర్ట్ వాహనాలను నడపాలంటే కచ్చితంగా శిక్షణ అవసరం. దీంతో వాహనదారులు ప్రైవేటు కారు, ఇతర వాహనాల డ్రైవింగ్ శిక్షణ కేంద్రాలను ఆశ్రయిస్తుంటారు. ఇక్కడ సరిగ్గా శిక్షణ లేకుండా, డ్రైవింగ్‌లో మెలకువలు నేర్చుకోకుండానే వాహనాలను రోడ్లపై నడిపేస్తుంటారు. ఫలితంగా రోడ్డు ప్రమాదాలకు కారకులవుతున్నారు. దీన్ని నియంత్రించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో వాహనదారులకు సరైన శిక్షణ అందించేందుకు జాతీయ రహదారుల శాఖ అనుమతితో ఖమ్మం జిల్లాలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డ్రైవింగ్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్(ఐడీటీఆర్) కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ శిక్షణ కేంద్రంలో వాహనాలు నడిపేందుకు అవసరమైన అత్యాధునిక ట్రాక్‌ను నిర్మిస్తారు. నిష్ణాతులైన డ్రైవర్లు శిక్షకులుగా థియరీ క్లాసులు బోధించడం, ప్రాక్టికల్‌గా డ్రైవింగ్‌లో మెలకువలను అధికారుల సమక్షంలో అభ్యర్థులకు నేర్పిస్తారు. ట్రాఫిక్ నిబంధనలు సక్రమంగా పాటించడం, వాహనాల మరమ్మతులు, నిర్వహణ వంటి అంశాలతో పాటు సిమ్యులేటర్‌పై స్టీరింగ్ నియంత్రణ, డ్రైవింగ్ మార్జిన్ చూసుకోవడంలో తర్ఫీదు ఇస్తారు. వయసుతో సంబంధం లేకుండా డ్రైవింగ్ లైసెన్సులకు దరఖాస్తు చేసుకున్న వారందరూ ఇక్కడ శిక్షణ తీసుకునేందుకు వీలుంటుంది. శిక్షణ పూర్తయి డ్రైవింగ్‌లో మెలకువలను నేర్చుకున్న అనంతరం రవాణా శాఖ నుంచి డ్రైవింగ్ లైసెన్సును జారీ చేస్తారు.

వాహనదారులకు ఎంతో మేలు: - తోట కిషన్‌రావు, ఖమ్మం జిల్లా రవాణాశాఖాధికారి రోడ్డు ప్రమాదాల నియంత్రణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వాహనదా రులకు శిక్షణ ఇచ్చేందుకు జిల్లాలో ఐడీటీఆర్ కేంద్రం ఏర్పాటుకు నిర్ణయించాయి. ఇది అందుబాటులోకి వస్తే వాహనదారులకు ఎంతో మేలు జరుగుతుంది. నిర్మాణానికి స్థల సేకరణ ప్రధాన సమస్యగా మారింది. ప్రధాన రహదారికి 200 మీటర్ల దూరంలో 10-15 ఎకరాల్లో స్థలం అవసరం. కానీ ఖమ్మం జిల్లా కేంద్రానికి సమీపంలో ఎక్కడా ప్రభుత్వ స్థలం అనువుగా లేదు. ఇప్పటికే ఈ విషయంపై జిల్లా ఉన్నతాధికారులు, రెవెన్యూ అధికారులకు లేఖలు రాశాం. రెవెన్యూ శాఖ అధికారులు స్థలం వెతికి రవాణా శాఖకు అప్పగిస్తే తక్షణమే ప్రతిపాదనలు రాష్ట్ర ప్రభుత్వానికి పంపిస్తాం. కేంద్రం అనుమ తి ఇచ్చిన వెంటనే నిర్మాణ పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటాం.

# నిలిచిన రసాయన శుద్ధి పనులు

ములుగు :యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప ఆలయ పరిరక్షణకు కేంద్ర పురావస్తుశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన రసాయన శుద్ధి(కెమికల్ వాష్) పనులు మధ్యలోనే ఆగిపోయాయి. జనవరి రెండో వారంలో ప్రారంభమైన పనులు మార్చి వరకు కొనసాగాయి. మిగిలిపోయిన పనుల కోసం మళ్లీ ప్రతిపాదనలు సిద్ధం చేయాల్సి ఉందని అధికారులు చర్చించుకుంటున్నారు. మళ్లీ నిధులు వచ్చే వరకు వేచి చూడాల్సిన పరిస్థితి. పురావస్తుశాఖ అధికారులు ఆలయ పైభాగంలో ఇటుకలపై ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో అందంగా తీర్చిదిద్దారు. విస్తారంగా కురిసిన వర్షాలతో ప్లాస్టర్ ఆఫ్ పారిస్ రంగుమారడం ప్రారంభమైంది. గమనించిన అధికారులు పదేళ్లకోసారి రసాయన శుద్ధి చేయడం మొదలు పెట్టారు. దీనిలో భాగంగా మొదలైన పనులకు మార్చి గడువు అడ్డు రావడంతో పనులు అసంపూర్తిగానే ఆగిపోయాయి. ఆలయపై భాగంలోని తూర్పు, దక్షిణ, ఉత్తరం భాగాల్లో రసాయన శుద్ధి పూర్తి చేసినా పడమర భాగంలో మాత్రం చేయాల్సి ఉంది. యునెస్కో గుర్తింపు పొందిన ఆలయం విషయంలో ఇంత నిర్లక్ష్యమా అని స్థానికులు చర్చించుకుంటున్నారు.

# మినీ బ్యాంకులుగా రేషన్ దుకాణాలు

సూర్యాపేట :మీకు ఆసరా పింఛన్ వస్తోందా.. నెలనెలా ఆ డబ్బు తీసుకోవడానికి ఇబ్బంది పడుతున్నారా.. మీరు ఉపాధిహామీ పథకం కూలీలా.. మీరు చేసిన పనికి వేతనం పొందడానికి తపాలా కార్యాలయం చుట్టూ తిరగాల్సి వస్తోందా.. ఇలాంటి కష్టాలను దూరం చేయడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకు సేవలు అందుబాటులో లేని చోట రేషన్ డీలర్ వద్దనే పౌరసేవలు లభించేలా ఏర్పాట్లు చేసింది. ఆసక్తిగా ఉన్న రేషన్ డీలర్లకు శిక్షణ ఇస్తోంది. ంషన్ డీలర్లకు ఆదాయ మార్గం పెంపొందించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఇప్పటికే పలు దఫాలుగా వేతనాలు..ఉద్యోగ భద్రత వంటి డిమాండ్లతో వారు ఆందోళనలు చేపట్టిన ఘటనలు సైతం ఉన్నాయి. వీరి ఇబ్బందులను కొంత వరకైనా పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ప్రస్తుత పరిస్థితుల్లో పూర్తిస్థాయిలో కమీషన్ మీద ఆధారపడే అవకాశం లేకపోవడంతో ప్రత్యామ్నాయ మార్గం వైపు దృష్టి సారించింది. అందులో భాగంగా చౌక ధరల దుకాణాల్లో మినీ బ్యాంక్‌ల ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఆ దిశగా ఇప్పటికే పౌరసరఫరాల శాఖ అధికారులు మినీ బ్యాంక్‌లపై సుముఖంగా ఉన్న డీలర్ల వివరాలు సేకరించారు. వారికి శిక్షణ ఇస్తున్నారు.



సేవల విస్తరణ

భారత తపాలా చెల్లింపుల బ్యాంకు (ఐపీపీబీ) సహకారంతో పౌర సేవలను అందించనున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకింగ్ సేవలను విస్తరించనున్నారు. ఉపాధిహామీ కూలీలకు చెల్లింపులు, ఆసరా పింఛన్ల చెల్లింపులు, నగదు జమ, తదితర సేవలు అందించేలా కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల్లో రేషన్ డీలర్లకు కోఆర్డినేటర్లు అవగాహన కల్పిస్తున్నారు. పట్టణ ప్రాంతాల్లో మినహాయిస్తే.. బ్యాంకింగ్ సేవలు అంతగా అందుబాటులో లేని గ్రామీణ ప్రాంతాల్లో ఇది ఉపయోగపడుతుంది. ఈ మేరకు స్మార్ట్‌ఫోన్, కంప్యూటర్, వినియోగంపై అవగాహన ఉన్న రేషన్ డీలర్లకు శిక్షణ అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. వినియోగదారులు విద్యుత్తు, నల్ల, ఫోన్, తదితర బిల్లులను, నగదు లావాదేవీలను కొనసాగించేలా ఏర్పాట్లు చేశారు. దీంతో ప్రజలకు బ్యాంకింగ్, డిజిటల్ సేవలు మరింత సులభంగా, సౌకర్యంగా మారనున్నాయి. 0-10 సంవత్సరాల వారికి ఇక్కడ నుంచే ఆధార్ కార్డు జారీ చేయనున్నారు. ఇది పూర్తి స్థాయిలో అమలైతే అటు డీలర్లకు, ఇటు ప్రజలకు ఉపయుక్తంగా మారనుంది.

950 మందికి...

ఉమ్మడి జిల్లాలో 2506 మంది రేషన్ డీలర్లు ఉన్నారు. వీరిలో పట్టణ ప్రాంతాల్లో, సుముఖంగా లేని వారిని మినహాయిస్తే మొత్తం 950 మందికి తొలుత డిజిటల్ బ్యాంకింగ్ సేవలపై శిక్షణ అందిస్తున్నారు. తపాలా సిబ్బంది, మండల కో ఆర్డినేటర్లు ఈ సేవలపై ఇష్టంగా వారికి అవగాహన కల్పిస్తున్నారు. వారికి డిజిటల్ యంత్రాలను సైతం అందిస్తున్నారు. డీలర్లకు ఇండియన్ పోస్టల్ పేమెంట్ బ్యాంకు సేవలు నిర్వహించేందుకు సర్వీస్ ప్రొవైడర్‌గా గుర్తించారు. ఈ సేవలు అందించే డీలర్లకు ప్రత్యేక కమీషన్ చెల్లించనున్నారు. ప్రతి లావాదేవీకి రూ.5 చొప్పున నెలలో రూ.5 లక్షల దాటితే రూ.11 చొప్పున కమీషన్ ఇవ్వనున్నారు. బ్యాంకులు లేని గ్రామాల్లో ఇలాంటి సేవలు ఉపయోగపడనున్నాయి.

అవగాహన కల్పించాం: పుల్లయ్య, డీఎస్‌వో, సూర్యాపేట

రేషన్ డీలర్లకు తపాలా సేవల ద్వారా ఆదాయం సమకూర్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. అందులో భాగంగా బ్యాంకింగ్ సేవలపై ఇష్టమున్న డీలర్లకు తపాలా సిబ్బంది ద్వారా శిక్షణ అందిస్తున్నాం. ఇప్పటికే అవగాహన కల్పించాం. గ్రామీణ ప్రాంతాల్లో డీలర్లకు మేలు చేకూరుతుంది. కమీషన్ పెరిగి ఆదాయం రెట్టింపు అవుతుంది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వం సూచిస్తోంది.

# నీటి వృథాపై.. కొత్త ప్రయోగం

సూర్యాపేట : పురపాలికల్లో తాగునీటి వృథా అరికట్టడంపై అధికారులు దృష్టిసారిస్తున్నారు. ఇళ్లలో ట్యాంకులు నిండి.. నల్లాలు సరిగా బంద్ చేయకపోవడంతో ఎక్కువగా మంచినీరు నేలపాలవుతోంది. వీటికీ అడ్డుకట్ట వేసేందుకు రాష్ట్ర పురపాలకశాఖ కొత్త ప్రయోగానికి శ్రీకారం చుట్టింది. ఎక్కువ నీటి వృథా జరుగుతున్న ఇళ్లను గుర్తించి.. వారికి కౌన్సెలింగ్ ఇవ్వడం ద్వారా సత్ఫలితాలు రాబట్టాలని చూస్తోంది. నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాలో 19 పురపాలికలు ఉన్నాయి. ఒక్కో పురపాలికలో తొలుత ఐదు వార్డులు, ప్రతి వార్డుల్లో 500 ఇళ్లను ఎంపిక చేయనున్నారు. నీటి వృథాను గుర్తించిన కుటుంబాలకు కౌన్సెలింగ్ ఇవ్వనున్నారు. ప్రధానంగా మురికివాడలు, శివారు ప్రాంతాలపై కన్నేయనున్నారు. జిల్లాలో రెండు, మూడు రోజుల్లో ఈ ప్రక్రియ ప్రారంభం కానుంది. వాహనాలు శుభ్రంనీటిని సరఫరా సమయంలో పట్టణాల్లో ఎక్కువగా వృథా అవుతోంది. గంటన్నర వరకు పంపిణీ జరిగితే అంతసేపూ శివారు ప్రాంతాల్లో నేలపాలవుతోంది. నీటిని పట్టుకున్న తర్వాత నల్లాలను బంద్ చేయడం లేదు. చాలామంది నిర్లక్ష్యంగా ద్విచక్ర వాహనాలు, కార్లు శుభ్రం చేసుకోవడంతోపాటు ఇంటి ఆవరణలో మొక్కలకు నీటిని పెడుతున్నారు. ఫలితంగా అన్ని ప్రాంతాల్లో సరిగా నీరందని పరిస్థితి దాపురిస్తోంది. వృథాను అరికడితే నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్న కాలనీవాసులకు మళ్లించడానికి అవకాశం ఉంటుందని అధికారులు భావిస్తున్నారు.

పరిశీలించి.. కౌన్సెలింగ్ ఇచ్చిస్థానిక స్వయం సహాయక సంఘాల సభ్యులు, పంపు ఆపరేటర్లు, సిబ్బందితో కలిసి అధికారులు తొలుత ఎంపిక చేసిన వార్డుల్లో పర్యటిస్తారు.



# అవినాష్‌రెడ్డిని 25వరకు అరెస్టు చేయొద్దు

హైదరాబాద్: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్యకేసులో కడప ఎంపీ అవినాష్‌రెడ్డికి హైకోర్టులో ఊరట లభించింది. అవినాష్‌రెడ్డి దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణ చేపట్టిన తెలంగాణ హైకోర్టు ఈనెల 25 వరకు అరెస్టు చేయవద్దని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈనెల 25 వరకు ప్రతి రోజూ అవినాష్‌రెడ్డి విచారణకు హాజరుకావాలని, సీబీఐ విచారణకు పూర్తిగా సహకరించాలని న్యాయస్థానం ఆదేశించింది. అవినాష్ విచారణ ఆడియో, వీడియో రికార్డు చేయాలని సూచించింది. ఈనెల 25న ముందస్తు బెయిల్ పిటిషన్‌పై తుది తీర్పు ఇస్తామని హైకోర్టు తెలిపింది.

ఇప్పటికే వైఎస్ భాస్కర్‌రెడ్డి, ఉదయ్ కుమార్‌రెడ్డిని సీబీఐ కోర్టు ఆరు రోజుల కస్టడీకి అనుమతి ఇవ్వడంతో వారిద్దరితో కలిపి అవినాష్‌రెడ్డిని ప్రశ్నిస్తామని సీబీఐ కోర్టుకు తెలిపింది. విచారణ సందర్భంగా.. ఎంపీ అవినాష్‌రెడ్డి తరఫు న సీనియర్ న్యాయవాది టి.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపించారు. "దస్తగిరి వాంగ్మూలం మినహా అవినాష్‌పై ఎలాంటి ఆధారాలు లేవు. దర్యాప్తులో గూగుల్ టేకవుట్ డేటాపై ఆధారపడటం తగదు. సునీల్ యాదవ్ కదలికలపై దస్తగిరి వాంగ్మూలం, గూగుల్ డేటా విరుద్ధంగా ఉన్నాయి. దస్తగిరి చెప్పింది తప్పా? గూగుల్ డేటా తప్పా? కుటుంబ, ఆర్థిక వివాదాలు, వివాహేతర సంబంధాలే వివేకా హత్యకు కారణమై ఉండొచ్చు. బంధువు కాబట్టి హత్యా స్థలికి వెంటనే వెళ్లాం. గదిని శుభ్రం చేయడం వెనుక ఎలాంటి కుట్ర లేదు" అని వాదించారు. ఈ దశలో జోక్యం చేసుకున్న ధర్మాసనం.. వివేకాకు గుండెపోటు అని ఎందుకు చెప్పారని ప్రశ్నించింది. అక్కడున్న వారు గుండెపోటు అని చెబితే అదే విషయం చెప్పారని అవినాష్ తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. నేటి విచారణపై స్పష్టత ఇవ్వాలని, సీబీఐ విచారణకు వెళ్లేందుకు అవినాష్ రెడ్డి సిద్ధంగా ఉన్నారని ధర్మాసనం దృష్టికి తెచ్చారు. హైకోర్టులో విచారణ కొనసాగుతున్నందున రేపు ఉదయం విచారిస్తామని సీబీఐ తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. అవినాష్‌రెడ్డి నుంచి మరింత సమాచారం సేకరించాల్సి ఉందని, ముందస్తు బెయిల్ ఇవ్వొద్దని వాదనలు వినిపించారు.

"గతంలో నాలుగుసార్లు ప్రశ్నించినప్పుడు అవినాష్ సహకరించలేదు. వివేకా హత్య కుట్ర అవినాష్‌రెడ్డికి తెలుసు. దర్యాప్తులో శాస్త్రీయ, సాంకేతిక ఆధారాలు సేకరించాం. అవినాష్‌రెడ్డి చాలా ప్రభావం చేయగల వ్యక్తి. ఆర్థిక, వివాహేతర సంబంధాలపై ఆధారాలులేవు. హత్యలో ఉపయోగించిన ఆయుధం రికవరీ కాలేదు. హత్య తర్వాత నిందితుడు ఆయుధంతో అవినాష్ ఇంటికి వెళ్లాడు" అని సీబీఐ తరఫు న్యాయవాది వాదనలు వినిపించారు. వివేకా కుమార్తె సునీత తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ .. "సీబీఐ నోటీసులు ఇచ్చినప్పుడల్లా అవినాష్‌రెడ్డి కోర్టుకు వస్తున్నారు. అవినాష్ ప్రమేయంపై నిందితులు, సాక్షులు సీబీఐకి చెప్పారు" అని కోర్టు దృష్టికి తెచ్చారు. అవినాష్‌రెడ్డి, సునీత, సీబీఐ తరఫు న్యాయవాది వాదనలు విన్న ధర్మాసనం ఈనెల 25 వరకు అవినాష్‌రెడ్డిని అరెస్టు చేయొద్దని సీబీఐని ఆదేశిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.



# 'పవన్ ఏం మాట్లాడాడో తెలుసుకో'.. పేర్నినానిపై పోతిన ఫైర్

విజయవాడ: జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌పై ఏపీ మంత్రి పేర్ని నాని చేసిన వ్యాఖ్యలపై జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధి పోతిన వెంకట మహేష్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. పేర్ని నానికి పిచ్చి బాగా ముదిరిందని... అజ్ఞానం ఎక్కువైందని మండిపడ్డారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. తాడేపల్లి ప్యాలెస్ నుంచి వచ్చిన స్క్రిప్ట్‌ను గుడ్డిగా చదివారని విమర్శించారు. పవన్ కళ్యాణ్ ఏం మాట్లాడాడో ముందు తెలుసుకో నాని అని హితవుపలికారు. ప్రజలను కించ పరచవద్దని పవన్ కళ్యాణ్ చాలా సందర్భాలలో చెప్పారని... నాయకులు తప్పుగా మాట్లాడితే పవన్ ఖండించారన్నారు. వైసీపీ నాయకులు తెలంగాణ ప్రజలను కించ పరుస్తారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ నాయకులు మాట్లాడే వాటిని వక్రీకరించారు.. మరి మంత్రి సిదిరి అప్పలరాజు మాట్లాడిన మాటలు పాలేరు పేర్ని నానికి వినపడలేదా అని నిలదీశారు. హరీష్ రావు మాట్లాడిన మాటలకు జగన్‌కు, మంత్రులకు పౌరుషం రావడంలేదా అని అన్నారు. ఏపీలో అవకాశాలు లేవని చెబితే జగన్‌కు సిగ్గు అనిపించడం లేదా అంటూ మండిపడ్డారు. పేర్ని నాని, అప్పలరాజు, బొత్స, కారుమూరి వంటివారు నోరు విప్పరా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్‌పై విమర్శలు చేస్తే లోటస్ పాండ్ కూలిపోతుందనే భయమా... లేక తమ వ్యాపారాలు హైదరాబాద్‌లో ఉండవనా అని అడిగారు. "పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలను ను వక్రీకరిస్తారా.. మీకు దమ్ముంటే హరీష్ రావు వ్యాఖ్యలకు కౌంటర్ ఇవ్వండి" అంటూ జనసేన నేత వ్యాఖ్యానించారు. తెలంగాణలో పార్టీ పెట్టి పాదయాత్ర చేస్తున్న షర్మిల అప్పలరాజు వ్యాఖ్యలను ఎందుకు ఖండించలేదని ప్రశ్నించారు. "మీరు మాట్లాడకపోతే అన్నా చెల్లెల్లు డ్రామా అనుకోవాల్సి వస్తుంది" అని అన్నారు. "పెద్దిరెడ్డి, బుగ్గన, మిథున్ రెడ్డికి ధైర్యం ఉంటే తెలంగాణ ప్రెస్ క్లబ్‌కు వెళ్లి మాట్లాడాలి. మీరు ఆ ప్రెస్ క్లబ్ నుంచి బయటకి రాగలరా. సీఎం తన వర్గం సేఫ్ చూసుకుని, ఇతర వర్గాలను ఉసి గొల్పుతున్నాడు. కాపు, బీసీ, దళిత మంత్రులే ఎదుటి వారిని తిట్టాలా. జగన్, అతని సామాజిక వర్గం మంత్రులకు నోళ్లు లేవా. మీరెన్ని కుట్రలు చేసినా వచ్చే ఎన్నికలలో వైసీపీ ఓటమి ఖాయం" అని స్పష్టం చేశారు. పవన్ కళ్యాణ్ ఇస్లాం విద్య, ధార్మిక సంస్థలకు రూ.25 లక్షల విరాళం ప్రకటించారన్నారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో మదరాసీలకు ఐదు లక్షలు విరాళంగా ఇచ్చారని తెలిపారు. తాను కష్టపడిన సొమ్మును ఇటువంటి సేవా కార్యక్రమాలకు ఇస్తున్నారన్నారు. అయితే జగన్మోహన్ రెడ్డి దోచుకో, దాచుకో అనే విధానంతో ప్రజలను ఇబ్బందులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పశ్చిమ నియోజకవర్గంలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో రెండువేల మంది ముస్లీం పేద కుటుంబాలకు రంజాన్ తోఫా అందజేస్తామని పోతిన వెంకట మహేష్ ప్రకటించారు.

# నేడు సీఎం జగన్ శ్రీకాకుళం జిల్లా పర్యటన

## గ్రీన్‌ఫీల్డ్ పోర్టు నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్న సీఎం



టెక్కలి(శ్రీకాకుళం జిల్లా): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకాకుళం జిల్లా పర్యటన షెడ్యూల్ ఖరారైంది. సంతబొమ్మాళి మండలం మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టు నిర్మాణానికి శంకుస్థాపన చేయడానికి రేపు(బుధవారం) సీఎం జిల్లాకు రానున్నారు. బుధవారం ఉదయం 8 గంటలకు సీఎం క్యాంపు కార్యాలయం నుంచి గన్నవరం ఎయిర్‌పోర్టుకు బయల్దేరుతారు. ఉదయం 9.20కు విశాఖపట్టణం ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. 9:30 గంటలకు విశాఖపట్టణంలో బయల్దేరి సంతబొమ్మాళి మండలం మూలపేటలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌కు 10.15 గంటలకు చేరుకుంటారు. 10.20 గంటలకు హెలీప్యాడ్ వద్ద నాయకులు సీఎంకు స్వాగతం పలుకుతారు. 10.25 గంటలకు హెలీప్యాడ్ నుంచి పోర్టు శంకుస్థాపన పైలాన్ ఆవిష్కరణకు బయల్దేరుతారు.

10:30 నుంచి 10:47 వరకు పోర్టు శంకుస్థాపన, గంగమ్మ తల్లికి పూజా కార్యక్రమాల్లో పాల్గొంటారు. 11 గంటలకు మళ్లీ హెలీకాప్టర్‌లో బయల్దేరి 11.10 గంటలకు నౌపడ వద్ద ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌కు చేరుకుంటారు. 11.10 నుంచి 11.20 వరకు హెలీప్యాడ్ వద్ద నాయకులంతా సీఎంకు స్వాగతం పలుకుతారు. 11.25 గంటల నుంచి 11.35 వరకు నౌపడ వద్ద పోర్టు నిర్వాసిత కాలనీకి శంకుస్థాపన చేస్తారు. దీంతో పాటు ఎచ్చెర్ల మండలం బుడగట్లపాలెం ఫిషింగ్ హార్బర్‌కు, హిరమండలం వంశధార లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు శంకుస్థాపన కార్యక్రమాలు చేస్తారు. 11.45 నుంచి 12 గంటల వరకు సభా వేదికపై ఇతర నాయకులు ప్రసంగిస్తారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి 12.30 గంటల వరకు సభా వేదికపై సీఎం వైఎస్ జగన్ ప్రసంగం చేస్తారు. 12.35 గంటలకు మూలపేట, విష్ణుచక్రం గ్రామాల ప్రజలతో ముఖాముఖి నిర్వహిస్తారు. 12.40 గంటలకు సభా వేదిక నుంచి బయల్దేరి హెలీప్యాడ్ వద్దకు చేరుకుంటారు. 12.45 నుంచి 1.05 వరకు స్థానిక నాయకులతో మాట్లాడుతారు. మధ్యాహ్నం 1.10 గంటలకు హెలీకాప్టర్‌లో బయలుదేరి 2 గంటలకు విశాఖపట్టణం ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. మధ్యాహ్నం 2.10 గంటలకు విశాఖపట్టణం నుంచి గన్నవరం చేరుకుంటారు. మధ్యాహ్నం 3 గంటలకు గన్నవరం నుంచి సీఎం క్యాంపు కార్యాలయానికి చేరుకుంటారు.



# అతీక్ హత్య కేసు.. ప్రధాన సూత్రధారిపై 'బిష్ణోయ్' ఎఫెక్ట్..!

ప్రయాగ్‌రాజ్: గ్యాంగ్‌స్టర్, మాజీ ఎంపీ అతీక్ అహ్మద్, అతడి సోదరుడు అష్రాఫ్ హత్య దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. జర్నలిస్టుల్లా వచ్చిన సన్నీ సింగ్, లవ్లేశ్, అరుణ్ మౌర్యలు ఈ హత్యలకు పాల్పడ్డారు. అయితే ఇప్పుడు ఈ ఘటనకు సంబంధించి కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఈ జంట హత్యల్లో ప్రధాన సూత్రధారుడు సన్నీసింగ్ అని తెలుస్తోంది. అతడే మిగతా ఇద్దరిని ఒప్పించి, ఈ దాడికి పాల్పడినట్లు విచారణలో వెల్లడైనట్లు సమాచారం. అతీక్‌ను హత్యచేసి పేరు సంపాదించాలనే లక్ష్యంతోనే కాల్పులు జరిపామని గతంలో నిందితులు వెల్లడించిన సంగతి తెలిసిందే. అయితే, ఇందులో ప్రధాన సూత్రధారిగా సన్నీసింగ్‌ను భావిస్తున్నారు. అతీక్, అతడి సోదరుడిపై కాల్పులు జరిపేందుకు మిగతా ఇద్దరిని అతడే ఒప్పించినట్లు తెలుస్తోంది. అలాగే గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ ప్రభావం అతడిపై ఉందట. లారెన్స్ వీడియోలు వీక్షించే అతీక్ హత్యకు ప్రణాళిక రచించినట్లు విచారణలో భాగంగా తెలుస్తోంది. ప్రముఖ పంజాబీ గాయకుడు సిద్ధూ మూసేవాలా హత్య వెనక లారెన్స్ గ్యాంగ్ ఉందన్న వార్తలు విన్న సన్నీ.. ఆ తరహాలో ఓ పెద్దవ్యక్తిని హత్య చేసి పాపులర్ కావాలని కలలుకన్నట్లు సమాచారం. లవ్లేశ్, అరుణ్‌తో పోల్చుకుంటే సన్నీ ప్రమాదకారుడని, అతడిపై 10కిపైగా కేసులు ఉన్నాయని పోలీసు వర్గాలు తెలిపాయి. ఉత్తరప్రదేశ్‌లో సంచలనం సృష్టించిన ఉమేశ్ పాల హత్య కేసులో నిందితుడిగా ఉన్న అతీక్ అహ్మద్, అతడి సోదరుడు అష్రాఫ్ అహ్మద్‌ను జైలు నుంచి మెడికల్ చెకప్‌కు తీసుకెళ్తుండగా వారిపై ఆకస్మికంగా కాల్పులు జరిగాయి. దాంతో వారు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ప్రస్తుతం నిందితులను ప్రయాగ్‌రాజ్ కేంద్ర కారాగారం నుంచి ప్రతాప్‌గఢ్ జిల్లా జైలుకు తరలించారు. పరిపాలనాపరమైన కారణాలతో తరలించామని పోలీసులు చెబుతున్నా.. అతీక్ కుమారుడు అలీ ప్రయాగ్‌రాజ్ జైలులోనే ఉన్న నేపథ్యంలో ఈ చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది. ఈ కాల్పులు ఘటనపై పలు అనుమానాలు వ్యక్తం అవుతోన్న సంగతి తెలిసిందే. అత్యవసరం కాకున్నా అతీక్, అతడి సోదరుడిని రాత్రి 10 గంటల సమయంలో వైద్య పరీక్షలకు తరలించడంలోని ఆంతర్యమేంటని పలువురు నేతలు ప్రశ్నిస్తున్నారు.

# ఎకో ఇండియా సంస్థతో ఏపీ ప్రభుత్వం ఎంవోయూ



విజయవాడ: ఎకో ఇండియా సంస్థతో ప్రభుత్వం ఎంవోయూ చేసుకున్నట్లు వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి కృష్ణబాబు వెల్లడించారు. ఎకో ప్రాజెక్ట్ ద్వారా రోగులకు మెరుగైన వైద్యం అందిస్తామన్నారు. ఈ సంస్థ పలు వైద్య కార్యక్రమాలపై వైద్య సిబ్బందికి శిక్షణ ఇస్తుందన్నారు. ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని విజయవంతం చేయడానికి వైద్య సిబ్బందికి శిక్షణ ఇస్తామని, ప్రతీ ఆరు నెలలకి ఒకసారి శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తామని పేర్కొన్నారు. గర్భిణీ స్త్రీలు, పాలిచ్చే తల్లులు, బీపీ, షుగర్, క్యాన్సర్ వ్యాధిగ్రస్తులకి వైద్య సేవలు పకడ్బందీగా నిర్వహించేలా శిక్షణ ఉంటుందన్నారు. "ఈ ఎంవోయూ ద్వారా ఏపీ ప్రభుత్వానికి ఎటువంటి భారం పడదు. మొత్తం ఉచితంగా శిక్షణ ఇవ్వడానికి ఈ సంస్థ ముందుకు వచ్చింది. హెల్త్ కేర్ రంగంలో నిరంతర శిక్షణ చాలా ఉపయోగపడుతుందని మా భావన. ఐదు మెడికల్ కళాశాలను ఈ ఏడాది ప్రారంభించబోతున్నాం. ఇప్పటికే విజయనగరం కళాశాలకి అనుమతులు వచ్చాయి. మిగిలిన నాలుగు కళాశాలలు దాదాపు 85 శాతం పనులు పూర్తయ్యాయి" అని తెలిపారు. "కాకినాడలో ఇద్దరు కోవిడ్ వల్ల మృతి చెందినట్లు వార్తలు మీడియాలో వచ్చాయి. కోవిడ్ పాజిటివ్ వల్ల చనిపోయారా.. ఇతర కారణాలు వల్ల చనిపోయారా అన్నది పరిశీలించాలని వైద్య శాఖ అధికారులని ఆదేశించాం. కోవిడ్ వల్ల మరణించినట్లు ఇంకా నిర్ధారణ కాలేదు. ఏపీకి 20 లక్షల డోసులు కావాలని కేంద్రాన్ని కోరాం. ఏపీతో పాటు అన్ని రాష్ట్రాలకి కేంద్రం పంపించాల్సి ఉంది. జాతీయ రహదారుల పక్కనే 13 ట్రామా కేర్ సదుపాయాలు ఏర్పాటు చేశాం" అని కృష్ణబాబు వెల్లడించారు.

# విజయవాడలో ఇసుక కాంట్రాక్టర్ల ఆందోళన




విజయవాడ: పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం విజయవాడలో ఇసుక కాంట్రాక్టర్లు ఆందోళనకు దిగారు. తాడిగడపలోని రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. గత రెండేళ్లుగా తమకు బిల్లులు ఇవ్వడంలేదని ఇసుక కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తం చేశారు. మార్చి నెల 25లోపు బిల్లులు ఇస్తామని అధికారులు హామీ ఇచ్చారని.. అయితే బిల్లులు ఇవ్వకుండా తిప్పుతున్నారని కాంట్రాక్టర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. పెండింగ్ బిల్లులు అడుగుతుంటే తమను కార్యాలయంలోకి కూడా రానివ్వడంలేదని కాంట్రాక్టర్లు వాపోయారు. అప్పులు చేసి ఇసుక రవాణా చేస్తే ప్రభుత్వం తమను పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. ఆర్థిక బాధలతో మానసికంగా కుంగిపోతున్నామని ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమకు బిల్లులు మంజూరు చేయాలని కోరారు. ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోతే తమకు ఆత్మహత్యేలే శరణ్యమని కాంట్రాక్టర్లు కంటతడిపెట్టారు.

# కలెక్టరేట్ వద్ద ఏపీజేఏసీ ఆధ్వర్యంలో మహాధర్నా




తిరుపతి: కలెక్టరేట్ వద్ద ఏపీజేఏసీ ఆధ్వర్యంలో ఉద్యోగులు మహాధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, వందలాదిమంది ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బొప్పరాజు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో ఛలో విజయవాడ వంటి కార్యక్రమాలు చేపడతామన్నారు. ఉద్యోగ సంఘాలను ఇబ్బందులు పాలు చేసి దారికి తెచ్చుకోవాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఉద్యోగుల మధ్య ఐక్యత ఉందని.. ఉద్యోగ సంఘాల నేతలు కలిసి పోరాడాలని అనుకుంటున్నామన్నారు. నాయకుల తీరు ఎలా ఉన్నా సంఘాలకు అతీతంగా ఉద్యోగులు కదిలి వస్తున్నారని బొప్పరాజు వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రైవేట్ కంపెనీ ద్వారా ప్రభుత్వం జీతాలు చెల్లిస్తోందని, ఎంత ఇవ్వాలో లెక్క కూడా చెప్పలేని పరిస్థితుల్లో ప్రభుత్వం ఉందని విమర్శించారు. ట్రెజరీ ద్వారా మాత్రమే తమకు పేమెంట్స్ జరగాలని డిమాండ్ చేశారు. తమ ఉద్యమంపై మంత్రులు అవహేళన చేయడం ద్వారా ఉద్యోగుల్లో మరింత కసి పెరుగుతోందని బొప్పరాజు పేర్కొన్నారు.

# వచ్చే ఎన్నికల్లో 'ఫ్యాన్'ను పీకిపారేయండి: లోకేశ్



ఆలూరు: వైకాపా పాలనలో నిత్యావసరాల ధరలు పెరిగిపోయాయని.. ప్రజల ఆదాయం మాత్రం పెరగలేదని తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ విమర్శించారు. 74వరోజు 'యువగళం' పాదయాత్రలో భాగంగా ఆలూరు నియోజకవర్గంలో ఆయన పర్యటిస్తున్నారు. నియోజకవర్గ పరిధిలోని దేవనకొండ శివార్లలోని శనగ చేలో దిగి రైతు కూలీలతో లోకేశ్ మాట్లాడారు. వారి కష్టాలను అడిగి తెలుసుకున్నారు. పెరిగిన విద్యుత్ ఛార్జీల గురించి రైతులు ప్రస్తావించగా.. వచ్చే ఎన్నికల్లో 'ఫ్యాన్'ను పీకిపారేయడమే దానికి పరిష్కారమన్నారు. కుంటిసాకులతో జగన్ ప్రభుత్వం తొలగించిన పింఛన్లను తెదేపా అధికారంలోకి వచ్చాక పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు. ధైర్యంగా ఉండాలని.. రాబోయే చంద్రన్న ప్రభుత్వంలో అంతా మంచే జరుగుతుందని బాధితులకు లోకేశ్ భరోసానిచ్చారు.

**ఆదోనిలో ఫ్లెక్సీల తొలగింపుపై తెదేపా నిరసన** : ఆదోని పట్టణంలో 'యువగళం' పాదయాత్రకు సంబంధించిన ఫ్లెక్సీలను పురపాలక సిబ్బంది తొలగించడంపై తెదేపా నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఈ సంఘటనపై నిలదీసేందుకు ఆ పార్టీ శ్రేణులంతా పురపాలక కార్యాలయానికి చేరుకుని నిరసన తెలిపారు. అనంతరం కమిషనర్ రఘునాథ రెడ్డితో చర్చించారు.

నారా లోకేశ్ యువగళం పాదయాత్రఫ్లెక్సీలను ఎందుకు తొలగిస్తున్నారని కమిషనర్‌ను ప్రశ్నించారు. పార్టీ పట్ల అధికారులు వివక్ష ప్రదర్శించడం సరికాదని గట్టిగా నిలదీశారు. తెదేపా ఆందోళన నేపథ్యంలో ఫ్లెక్సీల ఏర్పాటుకు అధికారులు అనుమతి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు లక్ష్మీనారాయణ, బాలాజీ, వెంకటేశ్, భూపాల్ చౌదరి, రంగస్వామి నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

# జగన్.. ఇలా సెల్ఫీ దిగే దమ్ము నీకుందా?



కర్నూలు : కర్నూలు జిల్లాలోని దేవనకొండలో యువగళం పాదయాత్ర నిర్వహిస్తున్న టీడీపీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌కి పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. పెద్ద ఎత్తున లోకేష్‌ని చూసేందుకు మహిళలు, యువత, వృద్ధులు రోడ్లపైకి వచ్చారు. అందరినీ ఆప్యాయంగా పలకరించి వారి సమస్యలను లోకేష్ అడిగి తెలుసుకుంటున్నారు. నిత్యావసర సరుకుల ధరలు, విద్యుత్ ఛార్జీలు, పన్నులు విపరీతంగా పెంచారన్నారు. చెత్త పన్ను కూడా ముక్కు పిండి వసూలు చేస్తున్నారన్నారు.

ఈ సందర్భంగా నారా లోకేష్ మాట్లాడుతూ.. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే పన్నుల భారం తగ్గిస్తామన్నారు. నిత్యావసర సరుకుల ధరలు తగ్గిస్తామని నారా లోకేష్ హామీ ఇచ్చారు. ఆలూరు నియోజకవర్గంలోని దేవనకొండ చెరువు ఒకప్పుడు ఎండిపోయి ఉండేదని నారా లోకేష్ పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చాక హంద్రీ నీవా జలాలతో చెరువును లింక్ చేశామన్నారు. దీని వల్ల దేవనకొండ పట్టణానికి తాగునీరు సహా పల్లెదొడ్డి, గెద్దరాళ్ల గ్రామాల్లో భూగర్భ జలాలు పెరిగి బోర్లకు పుష్కలంగా నీరు అందుతున్నాయన్నారు. ఇది తమ ప్రభుత్వం ఘనత అని పేర్కొన్నారు. 'జగన్.. ఇలా సెల్ఫీ దిగే దమ్ము నీకుందా?' అని నారా లోకేష్ సవాల్ చేశారు.

# జాన్వీ హెయిర్ స్టైల్ నయా ట్రెండ్!

ట్రెండ్ ని ఫాలో అవ్వడం కాదు..ట్రెండ్ ని సెట్ చేయాలి. రొటీన్ కి భిన్నంగా ఉన్నప్పుడే అలాంటివి సాధ్యం అవుతుంది. స్టార్ కిడ్ అతిలోక సుందరి ముద్దుల తనయ జాన్వీకపూర్ ఆ పనిలో ఉందనిపిస్తుంది. అవును జాన్వీ కపూర్ న్యూహెయిర్ స్టైలిష్ వీడియో ఒకటి ఇప్పుడు ఇన్ స్టాని షేక్ చేస్తోంది. ఫేమస్ హెయిర్ స్టైలిష్ అమిత్ ఠాకూర్ జాన్వీ హెయిర్ స్టైల్ ని కొత్త కోణంలో ఆవిష్కరించే ప్రయత్నం చేసారు. దానికి సంబంధించిన వీడియో షూట్ ఒకటి ఇన్ స్టాలో వైరల్ గా మారింది. స్కిన్ టైట్ గోల్డ్ కలర్ డిజైనర్ దుస్తుల్లో జాన్వీ కెమారాకి ఫోజులిచ్చింది. ఇందులో అమ్మడి హెయిర్ స్టైల్ పైనే ఫోకస్ చేసినట్లు కనిపిస్తుంది. ప్రస్తుతం ఆ వీడియో నెట్టింట



వైరల్ గా మారింది. ట్రెండ్ని ఫాలో అవ్వడంలో జాన్వీ ముందుంటుంది. ఎప్పటికప్పుడు న్యూ లుక్ లోఎలివేట్ అవ్వడానికి ఆసక్తి చూపిస్తుంది. విదేశీ మోడల్స్..ర్యాంప్ వాక్ భామల్లా ఇన్ స్టాలో వెలిగిపోతుంటుంది. క్యామ్ ముందు ఆవిష్కరించే అందాల ఆరబోత గురించైతే చెప్పాల్సిన పనిలేదు. మ్యాగజైన్ కవర్ పేజీలపై చిచ్చర పిడుగులా చెలరేగుతుంది. గ్లామర్ షోలో తనదైన ముద్ర వేసి పోటీ ప్రపంచంలో దూసుకుపోతుంది. ఇక జాన్వీ సినిమాల విషయానికి వస్తే ప్రస్తుతం కరణ్ జోహార్ బ్యానర్లో 'దోస్తానా–2' లో నటిస్తోంది. అదే బ్యానర్ లో మరో రెండు చిత్రాలు కమిట్ అయింది. అలాగే అమ్మడు నటించిన 'గుడ్ లక్ జెర్రీ' సినిమా షూటింగ్ పూర్తిచేసుకుని రిలీజ్ కి రెడీగా ఉంది. 'మిలీ' అనే మరో చిత్రంలో కూడా నటిస్తుంది.

వచ్చే ఏడాది ఆ సినిమా రిలీజ్ కానుంది. ఇక దక్షిణాదిన ఎంట్రీ ఇవ్వడానికి జాన్వీ ఆసక్తిగానే ఉంది. సరైన ప్రాజెక్ట్ కోసం ఎదురుచూస్తుంది. ఆ ఛాన్స్ వస్తే వదులుకోవడానికి ఎంత మాత్రం సిద్దంగా లేదు. తల్లి తరహాలోనే అన్ని భాషల్లోనూ సినిమాలు చేయాలని ప్రణాళికతో ముందుకు వెళ్తోంది. ఈ విషయంలో తండ్రీ బోనీకపూర్ వెనుకుండి ప్రోత్సహిస్తున్నారు. ఆయన అనుభవాలు అన్నింటిని రంగరించి జాన్వీ తెలివైన నిర్ణయాలతో ముందుకు సాగుతోంది. తెలుగు సినిమా పాన్ ఇండియా కి రీచ్ అవ్వడంతో ఇక్కడ ప్రత్యేక శ్రద తీసుకునే ఛాన్స్ ఉంది. తల్లి తరహాలోనే జాన్వీ తెలుగు సినిమాపైనా తన ముద్ర వేయాలని ఉవ్విళ్లూరుతుంది.

# వెనక నుంచి పట్టుకున్నాడు.. యువ నటి కాస్టింగ్ కౌచ్ అనుభవాలు..!

మలయాళ యువ నటి మాళవిక శ్రీనాథ్ కాస్టింగ్ కౌచ్ పై చేసిన కామెంట్స్ ఇప్పుడు హాట్ న్యూస్ గా మారాయి. కాస్టింగ్ కౌచ్ మీటూ పేరు ఏదైనా సినిమా పరిశ్రమలో హీరోయిన్ల పై జరుగుతున్న లైంగిక వేధింపుల గురించి బయట పెడుతూ వారిని ఇబ్బంది పెట్టిన వారిని టార్గెట్ చేస్తున్నారు. ఈ క్రమంలో కొన్నేళ్ల క్రితం తమ పై జరిగిన లైంగిక దాడుల గురించి కూడా కథానాయికలు పెదవి విప్పారు. ఇక లేటెస్ట్ గా ఈ విషయం పై కామెంట్స్ చేసింది మాలవిక



శ్రీనాథ్. మలయాళంలో ఇప్పుడే నటిగా గుర్తింపు తెచ్చుకుంటున్న మాళవిక తన పై జరిగిన లైంగిక వేధింపులను బయట పెట్టింది. తనను ఆడిషన్ కు పిలిచిన వ్యక్తే తనతో అసభ్యకరంగా ప్రవర్తించాడని చెప్పుకొచ్చింది. మలయాళంలో ఒక సినిమాలో మంజు వారియర్ కీలక పాత్ర పోషించగా అందులో ఆమె కూతురు పాత్ర కోసం ఆడిషన్ నిర్వహించారట. ఆ ఆడిషన్ లో ఒక వ్యక్తి తనని లైంగికంగా వేధించాడని మాళవిక రీసెంట్ ఇంటర్వ్యూలో చెప్పింది. ఆడిషన్ ని ఏర్పాటు చేసిన ఆ వ్యక్తే తన పై అసభ్యకరంగా ప్రవర్తించాడని చెప్పుకొచ్చింది. ఆడిషన్ జరుగుతున్న టైం లో తన మదర్ సిస్టర్ బయట ఉన్నారని.. లోపల ఆడిషన్ చేసే వ్యక్తి తనని వెనక నుంచి వచ్చి పట్టుకున్నాడని.. తాను విడిపించుకునే ప్రయత్నం చేయగా సర్దుకుంటే ఆ పాత్ర నీకే దక్కుతుందని చెప్పారని చెప్పింది. అయితే అతని నుంచి ఎలాగైనా తప్పించుకునేందుకు అక్కడ ఉన్న కెమెరా కింద పడటంతో అతని దృష్టి దాని మీదకు వెళ్లింది అప్పుడు అక్కడ నుంచి తప్పించుకున్నానని చెప్పుకొచ్చింది మాళవిక. తనకు జరిగిన ఈ విషయం తనని చాలా భయపెట్టిందని అయితే అందరు అలా ఉండరని కానీ కొందరు మాత్రం ఇలాంటి పనుల వల్ల హీరోయిన్స్ కి ఇబ్బంది కలిగిస్తున్నారని చెప్పింది.




# జివ్వు మనిపిస్తోన్న జాన్వీ కపూర్!



అతిలోక సుందరి శ్రీదేవి వారసురాలిగా బాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చిన జాన్వీ కపూర్ కెరీర్ దేదీప్యమానంగా సాగిపోతుంది. బాలీవుడ్ లో ఇప్పటికే తనదైన మార్క్ వేసింది. నటిగా మరింత షైన్ అవుతూ కెరీర్ ని చక్కగా బిల్డ్ చేసుకుంటోంది. వెనుక తండ్రి బోనీకపూర్ ప్రోత్సాహం జాన్వీ ఎదుగుదలలో కీలక పాత్ర పోషిస్తుంది. తల్లికి తగ్గ తనయురాలిగా అన్ని పరిశ్రమలో కుమార్తెకి ప్రత్యేకమైన ఐడెంటిటీ దిశగా ముందుకు తీసుకెళ్లాలన్నదే బోనీ ప్లాన్ గా కనిపిస్తోంది. ఇక జాన్వీ ఇన్ స్టాలో ఎంత యాక్టివ్ గా ఉంటుందో చెప్పాల్సిన పనిలేదు. సమయం చిక్కినప్పుడల్లా ఇన్ స్టాని ఓ రేంజ్ లో తనదైన గ్లామ్ షోతో హీటెక్కించడం జాన్వీ ప్రత్యేకత. తాజాగా బ్యూటీ మరో హాట్ ఫోటోతో ఇన్ స్టాలో వైరల్ గా మారింది. డెనిమ్ జీన్స్ దరించి..మ్యాచింగ్ వైట్ కలర్ స్కిన్ టైట్ బ్లౌజ్ లో కాకలు పుట్టిస్తోంది. చారడేసి కళ్లకు ఐటెక్స్ అద్దింది. మత్తెక్కించే చూపులతో కుర్రాళ్ల హృదయాల్నే కొల్లగొడుతోంది. ఉదయించే సూర్యుడి సైతం జాన్వీపైనే ఫోకస్ పెట్టాడు. ఎర్రటి రవి కిరణాల నడుమ జాన్వీ మరింత ప్రకాశవంతంగా ధగధగలాడుతోంది. సరిగ్గా బీచ్ ఒడ్డున ఇలా జాన్వీ కెమెరాకి ఫోజులిచ్చింది. ప్రస్తుతం ఈ ఫోటో ఇన్ స్టాలో వైరల్ గా మారింది. జాన్వీ పిక్ ని ఉద్దేశించి నెటి జనులు ఫైరింగ్ ఎమోజీలను పోస్ట్ చేస్తున్నారు. ఇన్ స్టాలో ఇలాంటి ఎలివేషన్స్ ఇవ్వడం జాన్వీకి కొత్తేం కాదు. ఫాలోవర్స్ సంఖ్యని పెంచుకోవడం కోసం బ్యూటీ ఇన్ స్టాని ఎప్పటికప్పుడు షేక్ చేస్తూనే ఉంటుంది. జిమ్..యోగా సెషన్స్ కి సంబంధించిన ఫోటోలు..వీడియోలు సోషల్ మీడియాలో తరుచూ వైరల్ అవుతుంటాయి. ఇన్ స్టా ఖాతాని మెయింటైన్ చేసేందుకు ప్రత్యేకమైన ఓ టీమ్ నే ఏర్పాటు చేసుకుంది. జాన్వీ అప్ డేట్స్ అన్ని వాళ్లే చూసుకుంటారు. ఇక జాన్వీ సినిమాల విషయానికి వస్తే నటిగా బిజీగా ఉంది. ప్రస్తుతం కరణ్ జోహార్ బ్యానర్లో దోస్తానా–2 లో నటిస్తోంది. అదే బ్యానర్ లో మరో రెండు చిత్రాలు కమిట్ అయింది. అలాగే అమ్మడు నటించిన గుడ్ లక్ జెర్రీ సినిమా షూటింగ్ పూర్తిచేసుకుని రిలీజ్ కి రెడీగా ఉంది. మిలీ అనే మరో చిత్రంలో కూడా నటి స్తుంది. ఇక దక్షిణాదిన ఎంట్రీ ఇవ్వడానికి జాన్వీ ఆసక్తిగానే ఉంది. కానీ సరైన ప్రాజెక్ట్ కోసం ఎదురుచూస్తుంది. తల్లి తరహాలోనే అన్ని భాషల్లోనూ సినిమాలు చేయాలని ప్రణాళికతో ముందుకు వెళ్తోంది.

# సేవ్ ది టైగర్స్ ఫుల్ ఫన్ రైడ్




ఈ మధ్యకాలంలో ఫన్ అండ్ ఎంటర్టైన్మెంట్ తో ఎక్కువగా కథలు ప్రేక్షకుల ముందుకి వస్తున్నాయి. జాతిరత్నాలు సినిమా ఎంత పెద్ద హిట్ అయ్యిందో అందరికి తెలిసిందే. ఆ సినిమా ఈ జెనరేషన్ కి కనెక్ట్ అయ్యే సింగిల్ లైన్ పంచ్ లతో ప్రేక్షకులకి కనెక్ట్ అయ్యే విధంగా ఎంటర్టైన్మెంట్ ని అందించారు. ఇదిలా అలాగే ఫ్యామిలీ ఫ్రస్టేషన్ కథలు ఎప్పుడు కూడా వినోదాన్ని అందిస్తూ ఉంటాయి అనే సంగతి తెలిసిందే. ఎప్పుడో పదేళ్ళ క్రితం వచ్చిన క్షేమంగా వెళ్లి లాభంగా రండి సినిమా నుంచి మొన్నటి ఎఫ్ 3 మూవీ వరకు ఫ్యామిలీ కథలకి మంచి కాలక్షేపం ఉంటుంది. ప్రేక్షకులు కావాల్సినంత వినోదాన్ని ఆశ్వాదిస్తూ ఉంటారు. తాజాగా సేవ్ ది టైగర్స్ అనే కాన్సెప్ట్ తో వెబ్ సిరీస్ ఇప్పుడు ప్రేక్షకుల ముందుకి రావడానికి రెడీ అవుతోంది. ఈ వెబ్ సిరీస్ కి సంబందించిన ట్రైలర్ ని తాజాగా రిలీజ్ చేశారు ప్రియదర్శి చైతన్య కృష్ణ అభినవ్ గోమటం ఇందులో లీడ్ రోల్స్ లో కనిపిస్తున్నారు. వారికి జోడీగా తీన్మార్ సుజాత పావని గంగిరెడ్డి దేవయాని నటించారు. అలాగే గంగవ్వ హర్షవర్ధన్ సద్దాం కీలక పాత్రలలో కనిపిస్తున్నారు. ముగ్గురు కూడా పెళ్లి తర్వాత భార్యలతో ఇబ్బందులు పడే భర్తలుగా ట్రైలర్ లో చూపించారు. పెళ్ళాల టార్చర్ భరించలేక ఫ్రస్టేషన్ తో బ్రతుకుతున్న ఈ ముగ్గురు కలుసుకోవడం ఇక తమ కష్టాలకి ఫుల్ స్టాప్ పెట్టాలని అనుకోవడం వంటి ఎలిమెంట్స్ తో ట్రైలర్ డిజైన్ చేశారు. అడవుల్లో పులులు అంతరించిపోయినట్లే భవిష్యత్తులో మగవాళ్ళు కూడా అంతరించిపోకుండా కాపాడుకోవాలి అంటూ చైతన్య కృష్ణ చెప్పే డైలాగ్ సినిమా కథలో దర్శకుడు చెప్పాలనుకున్న పాయింట్ ని ప్రెజెంట్ చేశారు. సేఫ్ ది టైగర్స్ తరహాలోనే సేవ్ ది మెన్స్ లాంటి ఉద్యమం రావాలని కోరుకునే ముగ్గురు యువకుల కష్టాల కథగా ఈ వెబ్ సిరీస్ ని ఆవిష్కరించారు. ఇదిలా ఉంటే టీజర్ చూస్తుంటే ఆద్యంతం నవ్వులు పంచె విధంగా ఉండబోతుందని తెలుస్తోంది. ఏప్రిల్ 27న హాట్ స్టార్ లో ఈ వెబ్ సిరీస్ స్ట్రీమింగ్ కాబోతుంది. మహి వి రాఘవ ప్రదీప్ అద్వైతం ఈ కాన్సెప్ట్ క్రియేటర్స్ గా ఉన్నారు. అలాగే దీనికి కథని ప్రదీప్ అద్వైతం విజయ్ నామోజు ఎస్ ఆనంద్ కార్తిక్ అందించారు. ఇక తేజ కాకుమాను దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. మరి ఈ వెబ్ సిరీస్ ప్రేక్షకులకి ఏ మేరకు కనెక్ట్ అవుతుంది అనేది వేచి చూడాలి.

# ఆ స్టార్ హీరోని 'ఆంటీ' అని పిలుస్తా: పూజా హెగ్డే

టాలీవుడ్లో ఉన్న మోస్ట్ వాంటెడ్ హీరోయిన్స్లో పూజా హెగ్డే ఒకరు. కెరీర్ స్టార్టింగ్లో వరుస ఫ్లాపులు ఎదురైనా.. అల్లు అర్జున్ హీరోగా తెరకెక్కిన 'దువ్వాడ జగన్నాథం'తో సక్సెస్ ట్రాక్ ఎక్కింది. ఆ తర్వాత వరుస ఆఫర్లను అందుకోవడంతో పాటు వరుస హిట్లనూ ఖాతాలో వేసుకుని స్టార్ స్టేటస్ను దక్కించుకుంది. ఇక చివరిగా ఈ బుట్టబొమ్మ 'రాధేశ్యామ్'తో ప్రేక్షకులను పలకరించింది. పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా రాధాకృష్ణ కుమార్ దర్శకత్వంలో రూపుదిద్దుకున్న ఈ వింటేజ్ ప్రేమ కథా చిత్రం మార్చి 11న విడుదలై నెగిటివ్ టాక్ సొంతం చేసుకుంది. గత కొంత కాలం నుంచి వరుస విజయాలతో దూసుకుపోతున్న పూజాకు 'రాధేశ్యామ్' రూపంలో బిగ్



ఫ్లాప్ పడింది. ఇదిలా ఉంటే.. ఇప్పుడీమె నటించిన మరో పెద్ద సినిమా రిలీజ్కు సిద్ధం అవుతోంది. అదే 'సర్కస్'. బాలీవుడ్ స్టార్ రణవీర్ సింగ్ హీరోగా రోహిత్ శెట్టి దర్శకత్వంలో రూపొందిన కామెడి ఎంటర్టైనర్ చిత్రమిది. ఇందులో పూజా హెగ్డే జాక్వెలిన్ హీరోయిన్లుగా నటించారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం త్వరలోనే విడుదల కాబోతోంది. అయితే తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న పూజా హెగ్డే.. వృత్తిపరమైన విషయాలే కాకుండా వ్యక్తిగత విషయాలనూ షేర్ చేసుకుంది. అలాగే రణవీర్ సింగ్ను 'అంటీ' అని పిలుస్తా అంటూ సీక్రెట్ కూడా రివీల్ చేసింది. పూజా మాట్లాడుతూ.. 'సెట్స్లో రణవీర్ సింగ్ ఉంటే ఫుల్ ఎంటర్టైన్మెంట్ ఉంటుంది. తనని నేను 'పమ్మీ ఆంటీ' అని పిలుస్తాను. ఎందుకంటే పరిస్థితులు ఎంత గంభీరంగా ఉన్నా సరే అతను తనదైన పంచ్లతో నవ్వుల్ని పంచుతాడు. రణవీర్ ఎక్కడ ఉంటే అక్కడంతా సందడి వాతావరణం ఏర్పడుతుంది' అంటూ చెప్పుకొచ్చింది. అలాగే సర్కస్ సినిమా మంచి విజయం సాధిస్తుందని.. ఇందులో తమ జంట ఎంతో చూడముచ్చటగా కనిపిస్తుందని కూడా ఆమె పేర్కొంది. కాగా పూజా హెగ్డే ఇతర ప్రాజెక్ట్ల విషయానికి వస్తే.. ఈమె నటించిన 'ఆచార్య' సినిమా విడుదలకు సిద్ధంగా ఉంది. అలాగే మహేష్ బాబు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబోలో తెరకెక్కనున్న చిత్రంలోనూ పూజా హీరోయిన్గా ఫిక్సైంది. తమిళంలో దళపతి విజయ్తో ఈమె చేసిన 'బీస్ట్' త్వరలోనే విడుదల కానుంది.

# మెగా నిహారిక.. ఈ రేంజ్ గ్లామర్ ఊహించలేదు

కొణిదెల నాగబాబు కూతురిగా చిరంజీవి పవన్ కల్యాణ్ ల అల్లరి కూతురిగా.. మెగా డాటర్ గా మంచి పేరునే సంపాదించుకుంది. ముందుగా టీవీలో యాంకర్ గా కెరియర్ ప్రారంభించిన ఈ క్యూట్ బ్యూటీ ఆ తర్వాత సినిమాల్లో వెబ్ సిరీస్ లలో నటించి మెప్పించింది. ఒక మనసు చిత్రంతో సినిమాల్లోకి వచ్చిన ఈమె ఆ తర్వాత పలు సినిమాల్లోనూ కనిపించింది. తన అందం అభినయంతో ఎంతో కొంత ఫాలోవర్స్ ను సొంతం చేసుకుంది. ముఖ్యంగా ముద్దపప్పు ఆవకాయ్ వెబ్ సిరీస్ తో విపరీతమైన క్రేజ్ ను దక్కించుకుంది. కేవలం సినిమాల్లో నటిగానే కాకుండా నిర్మాతగా కూడా మారి తన టాలెంట్ ను ప్రూవ్ చేసుకుంటుంది. 2020 డిసెంబర్ 9వ తేదీన జొన్నలగడ్డ చైతన్యను ప్రేమించి పెళ్లి చేసుకుందీ ముద్దుగుమ్మ. ఆ తర్వాత కూడా వరస సినిమాలు వెబ్ సిరీస్ లు చేస్తూ బిజీగా గడుపుతోంది. ఈ క్యూట్ బ్యూటీ ఎంత బిజీగా ఉన్నా



తనకు సంబంధించిన పర్సనల్ లైఫ్ తో పాటు ప్రొఫెషనల్ లైఫ్ కు సంబంధించిన విషయాలను సోషల్ మీడియా వేధికగా అందరితో పంచుకుంటుంది. అయితే తాజాగా నిహారిక ఇన్ స్టా వేధికగా కొన్ని ఫొటోలను షేర్ చేసింది. అందులో అదిరిపోయే ఔట్ పిట్ లో దర్శనం ఇస్తూ... కుర్రకారులో హీటు పుట్టిస్తోంది. డెనిమ్ వేర్ డ్రెస్ వేసుకొని ఫొటోలకు ఫోజులు ఇచ్చింది. చాలా హాట్ అంట్ స్ట్రెయిట్ లుక్ తో మరింత రచ్చ చేస్తోందీ ముద్దుగుమ్మ. ట్ర యాంగిల్ షేప్ లో ఉన్న వైట్ కలర్ ఇయర్ రింగ్స్ పెట్టుకొని.. మత్తెక్కించే కళ్లతోనే మాయ చేస్తోంది. ఈమె ఫొటోలు చూసిన నెటిజెన్లు పెద్ద ఎత్తున కామెంట్లు చేస్తున్నాయి. నిహారిక ఈ ఫొటోలు పోస్ట్ చేసిన కొన్ని గంటల్లోనే వేలల్లో లైకులు వందల్లో కామెంట్లు వచ్చాయి. చాలా అందంగా ఉన్నావు అదిరిపోయావు హేయ్ బ్యూటిఫుల్ అంత క్యూట్ అండ్ హాట్ గా ఎలా ఉన్నావంటూ పలువురు కామెంట్లు చేశారు. ఐ లవ్ నిహా బంగారం అంటూ ఓ నెటిజెన్ తన మనుసులోని భావాన్ని కామెంట్లు రూపంలో వెల్లడించారు. ఒక్కగానొక్క మెగా హీరోయిన్.. మామూలుగా లేదుగా అంటూ ఓ నెటిజెన్ కామెంట్ చేశాడు.



# మునుగోడు ఉప ఎన్నిక హామీ..

## 100 పడకల ఆస్పత్రికి మంత్రి హరీశ్ శంకుస్థాపన

చౌటుప్పల్: యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్లో 100 పడకల ఆస్పత్రికి మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. మునుగోడు ఉప ఎన్నిక సందర్భంగా మంజూరు చేసిన ఈ ఆస్పత్రిని రూ.36కోట్ల నిధులతో నిర్మించనున్నారు. శంకుస్థాపన అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడుతూ ఉమ్మడి నల్గొండ జిల్లాలో వైద్యఆరోగ్యశాఖ పరిధిలో రూ.1300కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని చెప్పారు. ఉప ఎన్నిక సందర్భంగా ఇచ్చిన హామీ ప్రకారం సీఎం కేసీఆర్ సూచనలతో 100 పడకల ఆస్పత్రికి శంకుస్థాపన చేశామన్నారు. మర్రిగూడలో 30 పడకల ఆస్పత్రి మంజూరు చేశామని.. తంగేడిపల్లి పీహెచ్‌సీకి రూ.90లక్షలు కేటాయించామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం బీబీనగర్‌లో ఎయిమ్స్ ప్రారంభించినా అక్కడ వసతులు లేవని.. కేవలం ఓపీ సేవలే అందిస్తున్నారని చెప్పారు. తెలంగాణ ఏర్పాటు కాకముందు రాష్ట్రంలో కేవలం 3 డయాలసిస్ సెంటర్లు ఉంటే.. ఇప్పుడు 100 ఏర్పాటు చేసుకున్నామని హరీశ్ తెలిపారు. కిడ్నీ రోగులకు డయాలసిస్ సేవలతో పాటు ఉచిత బస్‌పాస్ సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చామన్నారు.

నిరుపేదల వద్దకే వైద్యం వెళ్లాలనే ఉద్దేశంతో పల్లె దవాఖానాలను ప్రారంభించుకున్నామని హరీశ్ చెప్పారు. ప్రభుత్వ ఆస్పత్రిలో 30 శాతం మాత్రమే జరిగే ప్రసవాలు.. కేసీఆర్ కిట్‌తో ఇప్పుడు 68 శాతానికి పెరిగాయన్నారు. గతంలో ఎంబీబీఎస్ చదవాలంటే విద్యార్థులు ఉక్రెయిన్, ఫిలిఫ్పీన్స్ వెళ్లేవారని.. కానీ ఇప్పుడు 35 మెడికల్ కళాశాలలు రాష్ట్రంలో అందుబాటులోకి రావడంతో బయటికి వెళ్లకుండా స్వరాష్ట్రంలోనే వైద్యవిద్యను పూర్తి చేస్తున్నారని చెప్పారు.

# బీజేపీవి చేతలు తక్కువ.. ప్రచారం ఎక్కువ : మంత్రి హరీశ్ రావు



చౌటుప్పల్: తెలంగాణపై కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపుతోందని మంత్రి హరీశ్ రావు అన్నారు. కేంద్రం ప్రారంభించిన ఎయిమ్స్‌లో ఇప్పటివరకు ఎలాంటి అభివృద్ధి లేదని విమర్శించారు. చౌటుప్పల్‌లో 100 పడకల ఆస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేసిన అనంతరం మంత్రి హరీశ్ రావు మీడియాతో మాట్లాడారు. 2018లో యాదాద్రి జిల్లాకు ఎయిమ్స్‌ను కేటాయిస్తే నాలుగేళ్ల తర్వాత మోదీ వచ్చి శంకుస్థాపన చేశారని మంత్రి హరీశ్ రావు తెలిపారు. ఒక్క ఎయిమ్స్ కేటాయించినందుకే బీజేపీ నేతలు గొప్పలు చెప్పుకుంటున్నారని విమర్శించారు. చేతలు తక్కువ.. ప్రచారం ఎక్కువ అన్నట్లుగా బీజేపీ పరిస్థితి ఉందని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది 8 వైద్య కళశాలలు ప్రారంభించిందని గుర్తు చేశారు. ఎయిమ్స్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం 200 ఎకరాల భూమిని కేటాయించిందని పేర్కొన్నారు. వైద్యరంగంలో తెలంగాణ అద్భుతాలు సృష్టిస్తోందని మంత్రి హరీశ్ రావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పనితీరును నీతిఆయోగ్ కూడా ప్రశంసించిందని తెలిపారు. ప్రభుత్వ వైద్యంపై ప్రజల్లో నమ్మకం పెరిగిందన్నారు. ఫ్లోరైడ్ బాధితులకు ఉచితంగా డయాలసిస్ సేవలు అందిస్తున్నామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 102 డయాలసిస్ సెంటర్లను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. మిషన్ భగీరథ ద్వారా ఫ్లోరైడ్‌ను తరిమేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని ప్రశంసించారు. ఈ నెలలోనే న్యూట్రీషియన్ కిట్ పథకాన్ని ప్రారంభించబోతున్నామని తెలిపారు. సూర్యాపేట, నల్లగొండలో నర్సింగ్ కాలేజ్, పారా మెడికల్ కాలేజీ మంజూరు చేశామన్నారు. బీఆర్ఎస్ పాలనలో వైద్య విద్య బలోపేతమైందని మంత్రి హరీశ్ రావు పునరుద్ఘాటించారు. క్యాన్సర్ రోగుల కోసం కీమోథెరపీ సేవలు ప్రారంభించబోతున్నామని చెప్పారు. ఎల్బీనగర్‌లో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని ప్రారంభించబోతున్నామని తెలిపారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో ఒక్క ఏడాదిలో 10వేల పడకలు అందుబాటులోకి రాబోతున్నాయని తెలిపారు. వరంగల్ హెల్త్ సిటీ పనులు వేగంగా జరుగుతున్నాయని అన్నారు. డిసెంబర్ నాటికి వరంగల్ హెల్త్ సిటీ అందుబాటులోకి వస్తుందని తెలిపారు. దేశానికే తెలంగాణ మోడల్‌గా ఉందని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం విద్య, వైద్యానికి పెద్దపీట వేస్తోందని.. ఇదే కాంగ్రెస్ పాలనకు బీఆర్ఎస్ పాలనకు తేడా అని స్పష్టం చేశారు.

# ఆ కేసీఆర్ ఇప్పుడెక్కడ?



పెద్దపల్లి : గుడిని, గుడిలో లింగాన్ని సీఎం కేసీఆర్ మింగుతున్నాడని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత భట్టి విక్రమార్క పేర్కొన్నారు. నేడు ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సింగరేణి బ్లాకులను ప్రైవేటు పరం చేస్తే ఊరుకోబోమన్నారు. సింగరేణిని ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో ఎందుకు పెట్టాలని ప్రశ్నించారు.

రామగుండం ఎరువుల కర్మాగారం బాధితులకు న్యాయం చేయాలన్నారు. ఓపెన్ కాస్టను కుర్చీ వేసుకుని కూర్చొని మరీ పూడ్పించేస్తానన్న కేసీఆర్ ఇప్పుడు ఎక్కడ ఉన్నారని భట్టి ప్రశ్నించారు. రామగుండం బొందల గడ్డ అవుతుంటే కేసీఆర్‌కు కనబడటం లేదా? అని ప్రశ్నించారు. ఆంధ్ర నేతల కంటే కేసీఆరే ఎక్కువ దోచుకుంటున్నారని భట్టి విమర్శించారు.

# బంజారాహిల్స్ స్కూల్‌లో ఐదేండ్ల చిన్నారిపై లైంగిక దాడి.. డ్రైవర్‌కు 20 ఏండ్ల జైలు శిక్ష



బంజారాహిల్స్ రోడ్డు నం. 14లోని డీఏవీ పాఠశాలలో ఎల్‌కేజీ చదువుతున్న ఐదేండ్ల బాలికపై అదే స్కూల్‌లో డ్రైవర్‌గా పనిచేస్తున్న భీమన రజినీకుమార్(34) లైంగికదాడికి పాల్పడ్డాడు. స్కూల్‌లోని డిజిటల్ క్లాస్ రూమ్‌లోకి తీసుకువెళుతూ రోజూ బాలిక పట్ల అసభ్యకరంగా వ్యవహరించడంతో చిన్నారి తీవ్ర ఆందోళనకు గురైంది. బాలిక తల్లిదండ్రులు ఆరా తీయగా దారుణం బయటపడింది. ఈ వ్యవహారంపై బాలిక తల్లిదండ్రులు స్కూల్ వద్దకు చేరుకుని నిందితుడికి దేహశుద్ధి చేశారు. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు అక్టోబర్ 17న నిందితుడు రజినీకుమార్‌తో పాటు స్కూల్ ప్రిన్సిపాల్ మాధవిపై 376 (ఏబీ) రెడ్‌విత్ 5 (ఎం), 21 ఆఫ్ పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. అక్టోబర్ 19వ తేదీన అరెస్టు చేశారు. ఈ కేసు విచారణ చేపట్టిన నాంపల్లి ఫాస్ట్‌ట్రాక్ కోర్టు.. రజినీకుమార్‌ను దోషిగా తేల్చింది. అతనికి 20 ఏండ్ల జైలు శిక్ష విధించింది.

# తెలంగాణ గడ్డ మీద బీజేపీ కుట్రలు సాగవు: మంత్రి జగదీశ్‌రెడ్డి

చౌటుప్పల్: తెలంగాణ గడ్డమీద బీజేపీ కుట్రలు సాగవని మంత్రి జగదీశ్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఇవాళ నల్లగొండ జిల్లా చౌటుప్పల్‌లో బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ కార్యక్రమంలో జగదీశ్‌రెడ్డితోపాటు మంత్రి హరీశ్‌రావు, ఎంపీ లింగయ్య యాదవ్, ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు దేవీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ బీజేపీ, కాంగ్రెస్ పార్టీలపై విమర్శలు గుప్పించారు. తెలంగాణ సంక్షేమం, అభివృద్ధి యావత్ భారతానికి పాకిందని, దేశంలోని ఇతర రాష్ట్రాల ప్రజలు కూడా తెలంగాణ వైపు చూస్తున్నారని చెప్పారు. గుజరాత్ సహా బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఇక్కడి పథకాలకు డిమాండ్ పెరిగిందని మంత్రి పేర్కొన్నారు. ఆయా రాష్ట్రాల ప్రజలు తిరుగుబాటుకు సన్నద్ధమౌతున్నారని, హస్తిన పీఠం కదులుతుందన్న భయం బీజేపీకి పట్టుకుందని మంత్రి ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ అంటేనే ఢిల్లీ బాస్‌లకు వణుకు అని వ్యాఖ్యానించారు. మోదీ సొంత రాష్ట్రంలో దారిద్ర్యం పెరిగిందన్నారు. ఆ రాష్ట్రంలో 35 శాతానికి పైగా జనం అర్ధాకలితో అలమటిస్తున్నారన్నారు. గుజరాత్ ప్రజలది తాగునీరు కొనుక్కునే దుస్థితి అని మండిపడ్డారు. గుజరాత్‌లో ప్రజలకు విద్యుత్ సరఫరా కూడా ఆరు గంటలేనని ఎద్దేవా చేశారు. గుజరాత్‌లో ఆసరా పింఛన్ అందేది రూ.600 మాత్రమేనని మంత్రి తెలిపారు. అక్కడ మోటార్లకు మీటర్లు పెట్టి ముక్కుపిండి బిల్లుల వసూలు చేస్తున్నారని చెప్పారు. ఉచిత విద్యుత్ మాకెందుకు ఇవ్వడం లేదనే చర్చ దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో మొదలైందని, ఇంటింటికి మంచినీరు మాకెందుకు ఇవ్వడం లేదని ప్రజలు డిమాండ్ చేస్తున్నారని మంత్రి తెలిపారు. కళ్యాణలక్ష్మి/షాది ముబారక్, కేసీఆర్ కిట్, అమ్మవడి పథకాలు మాకెందుకు లేవని జనం ప్రశ్నిస్తున్నారని, దాంతో బీజేపీ నేతల్లో కలవరం మొదలైందని, అందుకే ఇక్కడ అభివృద్ధిని అడ్డుకునేందుకు మోకాలొడ్డుతున్నారని, సంక్షేమ పథకాలకు అవరోధాలు సృష్టిస్తున్నారని, వాటన్నింటినీ అధిగమించే సత్తా ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఉందని మంత్రి చెప్పారు.





# నిర్మల్‌లో అటవీభూమిని ఈద్గాకు కేటాయించడంపై బండి సంజయ్ ఆగ్రహం

హైదరాబాద్: నిర్మల్ పట్టణంలో వృత్తి నైపుణ్య శిక్షణా కేంద్రం కోసం కేటాయించిన అటవీ భూమిని చట్ట విరుద్ధంగా ఈద్గా నిర్మాణం కోసం కేటాయించిన బాధ్యులపై చర్యలు తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కేసీఆర్‌కు (%జవీ ఖజ=%) బీజేపీ నేత లేఖ రాశారు. నిరుద్యోగ యువత భవిష్యత్తు తాకట్టు పెట్టి స్వార్థ రాజకీయాల కోసం ఈద్గా ప్రార్థనల కోసం భూమి కేటాయించడం చట్ట విరుద్ధమన్నారు. ప్రజా ప్రయోజనాల కోసం కేటాయించిన భూములను ఇతర ప్రయోజనాలకు వినియోగించొద్దని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు స్పష్టం చేసిన విషయాన్ని గుర్తుచేశారు. కోర్టు తీర్పులకు వ్యతిరేకంగా నిర్మల్ జిల్లా చించోలిలో ఈద్గాను నిర్మించడం న్యాయ వ్యవస్థను అవమానించడమే అని.. ఇది ముమ్మాటికీ కోర్టు ధిక్కరణే అని అన్నారు.

హిందూ దేవాలయాలకు సమీపంలోనే ఈద్గా ప్రార్థనలకు భూమి కేటాయించడం ప్రజల మధ్య వైషమ్యాలను రెచ్చగొట్టేందుకే అని భావించాల్సి వస్తోందన్నారు. ఓట్ల కోసం విద్యార్థుల ప్రయోజనాలను పక్కనపెట్టి ఒక మతానికి కొమ్ము కాసేలా నిర్ణయాలు తీసుకోవడం తమ స్వార్థ రాజకీయాలకు పరాకాష్ట అని మండిపడ్డారు. చట్ట విరుద్ధమైన భూమిలో ఈద్గా నిర్మాణం ప్రారంభానికి దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి , ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ వెళ్తుడటం బాధాకరమని అన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం యువత భవిష్యత్తును బలి చేసే చర్యలను తెలంగాణ బీజేపీ తీవ్రంగా ఖండిస్తోందని తేల్చిచెప్పారు. కేంద్ర ప్రభుత్వం, కేంద్ర పర్యావరణ శాఖ ఉత్తర్వులు బేఖాతారు చేసి రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళితే తగిన మూల్యం చెల్లించాల్సి వస్తుంద అంటూ బండి సంజయ్ లేఖలో పేర్కొన్నారు.

# హైదరాబాద్‌లో ద్వేషం, హింసకు చోటు లేదు..

## సిట్‌కో ఆఫీసు ప్రారంభంలో మంత్రి కేటీఆర్



హైదరాబాద్ : హైదరాబాద్ విభిన్న సంస్కృతుల సమ్మేళనంగా ఉందని.. దేశంలోని ప్రజలు అంతా తమ ఇంట్లో ఉన్నట్లు భావిస్తున్నారని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. గత తొమ్మిదేండ్లలో సాంకేతిక రంగంలో ఉద్యోగుల సంఖ్య 3.25 లక్షల నుండి 10 లక్షలకు పెరిగిందని తెలిపారు. హైదరాబాద్ నాలెడ్జ్ సిటీలో గ్లోబల్ ఆల్టర్నేటివ్ ఇన్వెస్ట్‌మెంట్ అసెట్స్ సర్వీస్ సిట్‌కో కొత్త యూనిట్‌ను మంత్రి కేటీఆర్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. హైదరాబాద్ అన్ని సంస్కృతులను స్వాగతిస్తుంది.

అర్థంలేని మాటలకు, ద్వేషం, హింసకు ఇక్కడ చోటు లేదు. ఇక్కడ లా అండ్ ఆర్డర్ కఠినంగా ఉంటుంది. మరీ ముఖ్యంగా విద్య, అకడమిక్, ఇన్నోవేషన్, పర్యావరణ వ్యవస్థలు పగడ్బందీగా ఉన్నాయని మంత్రి కేటీఆర్ తెలిపారు. ఇమేజ్ టవర్స్, యానిమేషన్, గేమింగ్, మల్టీమీడియా కోసం ఇక్కడ ఒక కేంద్రం నిర్మించబడుతోందని మంత్రి పేర్కొన్నారు. ఇది 18 ఎకరాల్లో విస్తరించి ఉండగా.. ప్రపంచంలోనే అతిపెద్ద ఇన్నోవేషన్ క్యాంపస్ అవుతుంది.

దీనికి హైదరాబాద్‌ను ఎంపిక చేసుకుని సిట్‌కో తెలివైన పని చేసిందన్నారు. సిట్‌కో మనీలాలో 3500 మంది ఉండగా, టొరంటో కేంద్రంలో 2500 మందే ఉన్నారు. హైదరాబాద్‌లో అమెజాన్ యొక్క అతిపెద్ద క్యాంపస్, మైక్రోసాఫ్ట్, మెటా, యాపిల్, గూగుల్, ఉబెర్, మైక్రోన్, క్వాల్‌కామ్ వంటి సంస్థల రెండవ అతిపెద్ద క్యాంపస్‌కు నిలయంగా హైదరాబాద్ మారిందన్నారు. ఈ క్రమంలో సిట్‌కోకు చెందిన ప్రపంచంలోనే రెండో అతిపెద్ద క్యాంపస్ హైదరాబాద్‌లో ఉండాలని, దానిని సాకారం చేద్దాం అని కేటీఆర్ చెప్పారు.

# 'సరూర్‌నగర్‌లో భారీ సభ.. ముఖ్య అతిథిగా ప్రియాంకా గాంధీ'



హైదరాబాద్: టీఎస్‌పీఎస్సీ కేసు విచారణ రాష్ట్ర అధికారులు చేపడితే కేసులో నిజానిజాలు నిగ్గు తేలవని టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి అన్నారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ... ప్రభుత్వంలో పెద్దలను కాపాడుకునేందుకే ప్రభుత్వం సిట్‌ను ఉపయోగించుకుందన్నారు. ప్రతీ ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తానన్న మోదీ నిరుద్యోగులను మోసం చేశారని మండిపడ్డారు. 22 కోట్ల 6 లక్షల దరఖాస్తులు వస్తే 7,22,311 ఉద్యోగాలు ఇచ్చామని పార్లమెంట్‌లో ప్రధాని సమాధానం ఇచ్చారని.. అంటే పార్లమెంటు సాక్షిగా నిరుద్యోగులను మోసం చేసినట్లు ప్రధాని అంగీకరించారన్నారు. తెలంగాణలో అధికారంలోకి వస్తే ఒకే రోజులో 2లక్షల ఉద్యోగాలు ఇస్తామని బండి సంజయ్ చెబుతున్నారని.. బండి మాటలు వింటే నవ్వాలో ఏడవాలో అర్థం కావడం లేదని వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్ వరదల సమయంలో బండి పోతే బండి ఇస్తామన్నారు... ఆ తరువాత ఇన్సూరెన్స్ ఉంది కదా అన్నారన్నారు. అసలు ఏ శాఖలో ఎన్ని ఉద్యోగ ఖాళీలు ఉన్నాయో బండికి తెలుసా? అని రేవంత్ ప్రశ్నించారు. ఇంటికో ఉద్యోగం అని కేసీఆర్, ఒకే రోజు 2 లక్షల ఉద్యోగాలని బండి ప్రజలను మోసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాక్షేత్రం నుంచి పార్లమెంట్ వరకు నిరుద్యోగుల కోసం కొట్లాడింది కాంగ్రెస్ అని చెప్పుకొచ్చారు. బండి సంజయ్ నిరుద్యోగ మార్చ్ మోదీ ఇంటి దగ్గర చేయాలని హితవుపలికారు. ఈ నెల 21న నల్గొండలో మహాత్మా గాంధీ యూనివర్సిటీలో నిరుద్యోగ నిరసన చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ నెల 24న ఖమ్మం జిల్లాలో, 26న ఆదిలాబాద్‌లో నిరసన కార్యక్రమాలు చేపడతామని వెల్లడించారు. మే 4 లేదా 5న సరూర్‌నగర్‌లో నిరుద్యోగుల సమస్యలపై భారీ సభ నిర్వహిస్తామన్నారు. ఎల్బీ నగర్‌లోని శ్రీకాంతాచారి విగ్రహానికి నివాళులు అర్పించి.. సభా ప్రాంగణానికి ర్యాలీగా వెళతామని అన్నారు. ఈ సభకు ప్రియాంక గాంధీ ముఖ్య అతిథిగా పాల్గొంటారని టీపీసీసీచీఫ్ పేర్కొన్నారు.

ఇది కాంగ్రెస్ పార్టీ కోసం కాదని.. నిరుద్యోగుల కోసం చేస్తున్న పోరాటమని స్పష్టం చేశారు. అన్ని నిరుద్యోగ సంఘాలు మద్దతు తెలపాల్సిందిగా కోరారు. మే 9 నుంచి హాత్ సే హాత్ జోడో యాత్ర రెండో విడత కార్యక్రమం ఉంటుందని.. జోగులాంబ జిల్లా నుంచి యాత్ర ప్రారంభమవుతుందని రేవంత్ రెడ్డి ప్రకటించారు.

# కేసీఆర్‌పై ఓ రేంజ్‌లో మండిపడ్డ వైఎస్ షర్మిల

హైదరాబాద్: గతంలో నిరుద్యోగులు ఆత్మహత్యలకు పాల్పడినా,.. ఇప్పుడు పేపర్ లీకేజీలతో నిరుద్యోగుల కష్టార్జితం నీటిపాలైనా.. దొర గారికి దున్నపోతు మీద వానపడ్డట్టే ఉందని సీఎం ఉద్దేశించిన YSR తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల మండిపడ్డారు. TSPSC బోర్డు అంగట్లో సరుకులు అమ్ముతున్నట్లు క్వశ్చన్ పేపర్లు అమ్మకానికి పెట్టినా ఈ సర్కారుకు సిగ్గురాదని విమర్శించారు. TSPSC స్కాం జరిగి, నెలన్నర దాటుతున్నా.. ఇప్పటివరకు ఒక్క రివ్యూ లేదు, మీటింగు లేదని మండిపడ్డారు. నిరుద్యోగుల పక్షాన గళమెత్తితే పిరికిపందలా, అధికారమదంతో పోలీసులను పంపించడం, హౌజ్ అరెస్ట్ చేయించడం.. ఇది మాత్రం చేతనైందని విమర్శించారు. స్కాంపై ఎలాంటి చర్యలు లేకుండానే పరీక్షలు నిర్వహించి, మళ్లీ క్వశ్చన్ పేపర్లు అమ్మి, నిరుద్యోగులకు ఉద్యోగాలు రాకుండా చేయాలన్నదే కేసీఆర్ లక్ష్యంగా ఉన్నట్లుందన్నారు. వెంటనే TSPSC బోర్డును ప్రక్షాళన చేయాలని YSR తెలంగాణ పార్టీ డిమాండ్ చేస్తుందన్నారు. నిరుద్యోగుల మీద కేసీఆర్‌కు చిత్తశుద్ధి ఉంటే ఈ ఘటనపై CBI విచారణ జరిపించి, ఎంతటి దోషులనైనా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.





Printed, Published and owned by VISHWANATH V, Printed at Ratan Graphics D.No. 2-3-703/7, Ameerpet, Hyderabad - 500013 Telangana State and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State. Editor : V. VISHWANATH, M.A. Journalism
Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : garudavartha@gmail.com